# న్యాయ, సమాన, సుస్థిర భారత దేశానికి ప్రజల మ్యానిఫెస్టో

# వికల్ప్ సంగమ్ సర్వసభ్య సంఘ సభ్యులు (సభ్యుల వివరాలు చివరలో ఉన్నాయి)

2024

మానవ, జీవావరణ సంక్షేమం కోసం న్యాయ, సమాన, సుస్థిర దారులపై పని చేస్తున్న వ్యక్తులు, బృందాలు, ఉద్యమాలను ఒకే వేదిక పైకి తీసుకుని వచ్చే ప్రక్రియ వికల్ప్ సంగమ్. ప్రస్తుత అభివృద్ధి నమూనాని, దాని మరుగున ఉన్న అసమాన, అన్యాయ వ్యవస్థలను తిరస్కరించి, ఆచరణలోనూ, దార్శనికతలోనూ ప్రత్యామ్నాయాల కోసం అన్వేషిస్తుంది. దేశ వ్యాప్తంగా ఉన్న 85 ఉద్యమాలు, సంస్థలు దీని సర్వ సభ్య సంఘంలో ఉన్నాయి. ఈ పత్రం చివరిలో ఆ వివరాలు ఉన్నాయి. మరింత సమాచారం కోసం చూడండి:
http://www.vikalpsangam.org/about/

విషయ సూచిక

భాగం 1: మేం ఇస్తున్న మాట, ఇతరులను ఇవ్వమంటున్న మాట
భాగం 2: చర్యల సారాంశం
భాగం 3: రంగాల వారీగా చర్యల వివరణలు
భాగం 4: యువత భాగస్వామ్యాన్ని పెంపొందించటానికి ప్రత్యేక దృష్టికోణం
వికల్ప్ సంగమ్ సర్వసభ్య సంఘ సభ్యుల వివరాలు

## భాగం 1: మేం ఇస్తున్న మాట, ఇతరులను ఇవ్వమంటున్న మాట

*ప్రస్తుత తరాలకు, రానున్న తరాలకు, ప్రకృతి అంతటికి ఈ కింద పేర్కొన్న అంశాలు ఉండేలా న్యాయ, సమాన, సుస్థిర భారత దేశానికి మేం కట్టుబడి ఉంటాం, పౌరులందరినీ కట్టుబడి ఉండమని కోరుతున్నాం:*

- *భౌతికంగా, సాంస్కృతికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా పరిపూర్ణ జీవితాలు, జీవనోపాధులు ఉండేలా అవకాశాలు కల్పిస్తూ అందరికీ సౌభాగ్యం, ఆరోగ్యం అందించటం;*
- *ప్రత్యక్ష ప్రజాస్వామ్య రూపాల ద్వారా నిర్ణయాలు తీసుకోవటంలో అర్థవంతంగా పాల్గొనటానికి అందరికీ అవకాశాలు ఉండటం;*
- '*లింగ, వర్గ, జాతి మూలాలు (ఎథినిసిటీ), మత, 'జాతి, సామర్థ్యం, లైంగిక ధోరణి వంటి ఇతర అంశాల ఆధారంగా ఎటువంటి వివక్షత లేకుండా ఉండటం;*
- *సంస్కృతులు, జ్ఞానాలు, విశ్వాసాల వైవిధ్యతను, బహుళతను గౌరవించటం, సామరస్య సహజీవనానికి తోడ్పడటం;*
- మొత్తం జీవం ఆధారాపడిన ప్రకృతి పైన, జీవావరణ పరిస్థితుల పైన గౌరవం చూపటం*;*

ఇటువంటి సమాజాన్ని సాధించటానికి పౌర సమాజ సంఘాలుగా, ఉద్యమాలుగా చెయ్యగలిగినదంతా చెయ్యటానికి కట్టుబడి ఉంటాం*;* ప్రభుత్వ సంస్థలు, వ్యాపారాలు, ప్రసార సాధనాలు, ఇతరుల నుంచి జవాబుదారీతనం, పారదర్శకత కోరుతూ స్వయంగా వీటిని పాటిస్తాం.

ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న పలు సంక్షోభాల నేపథ్యంలో కట్టుబడి ఉంటామని పైన పేర్కొన్న విషయాలు (కింద పేర్కొనబోతున్న సంబంధిత చర్యలు) ఎంతో అవసరం అయినవి. సామాజిక వైరుధ్యాలు, మతపరమైన విద్వేషాలు, అసహనం, అసమానత, అనారోగ్యం, సాంస్కృతిక (భాషతో సహా) వారసత్వం & వైవిధ్యతలలో క్షీణత, పెద్ద ఎత్తున జీవావరణ విధ్వంసం వంటివి పెరుగుతూ ఉన్నాయి. పురుషుల ఆధిపత్యంలో ఉన్న ప్రస్తుత ఆర్థిక అభివృద్ధి నమూనాలు పెద్ద ఎత్తున పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల ఎదుగుదలకు ప్రాధాన్యతను ఇచ్చి, ప్రకృతినీ, సామాజిక సంబంధాలను సరుకులుగానూ, వ్యాపారంగానూ మార్చటం వల్ల ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని రాజ్యంలోని నియంతృత్వ, మతపరంగా విడదీసే ధోరణులు ప్రోత్సహిస్తున్నాయి. వీటికి పునాదిగా సాంప్రదాయంగా వస్తున్న అసమానతలు, లింగ, కుల వంటి అనేక రకాల వివక్షతలు ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో ప్రజాస్వామ్య ప్రక్రియలలో ఈ వర్గాలు సాధించిన ప్రగతిని ఈ ధోరణులు అడ్డుకుంటున్నాయి, హరించివేస్తున్నాయి. మహిళలు, యువత, లైంగిక అల్పసంఖ్యాక వర్గాలు, దివ్యాంగులు, మూలవాసులూ, అణచివేతకు గురవుతున్న కులాలు, మతపరమైన అల్ప సంఖ్యాక వర్గాలు, పెత్తందారీ వ్యవస్థ సాధారణంగా విస్మరించే ఇతరుల క్రియాశీలక భాగస్వామ్యంతో అందరి బాగుకు మరింత మానవీయ, ప్రకృతి హితమైన, సమతతో కూడుకున్న, అందరినీ కలుపుకుని వెళ్లే దారులు ఉన్నాయని మేం నమ్ముతున్నాం.

2019లో మేం ప్రజల మ్యానిఫెస్టో (*[https://vikalpsangam.org/article/peoples-manifesto-for-a-just-equitable-and-sustainable-india-2019/](https://vikalpsangam.org/article/peoples-manifesto-for-a-just-equitable-and-sustainable-india-2019/)*) విడుదల చేసిన తరవాత పైన పేర్కొన్న పలు సంక్షోభాలు మరింత తీవ్రం అయ్యాయి. కొన్ని ఉదాహరణలు: భారత దేశంలో స్వయం ప్రతిపత్తి కలిగిన జమ్ము & కశ్మీర్, లడఖ్, లక్ష్వద్వీప్, ఈశాన్య ప్రాంతలను మరింత కేంద్రీకృత పాలన కిందకు తీసుకుని రావటం. జీవావరణం కుప్ప కూలటం అన్నది మరింత స్పష్టంగా కనపడటం (జోషిమఠ్ కుంగటం, వాతావరణ సంక్షోభం కారణంగా తీవ్ర వర్ష, ఎండ పరిస్థితులు). మతపర లేదా మూలవాసుల మధ్య ఘర్షణలు (మణిపూర్ వంటివి). రాజ్యానికి సంబంధించిన వ్యవస్థల ద్వారా లైంగిక హింసను ఆమోదించటం లేదా ప్రోత్సహించటం (బిల్కిస్ బానో వంటివి).

భారత దేశం ఎదుర్కొంటున్న ఈ అనేక సంక్షోభాల పరిష్కారానికి కట్టుబడటం అంటే భారత రాజ్యాంగంలోని విలువలకు మరింతగా అంకితం కావటం, ప్రభుత్వ ప్రణాళికల తయారీతో సహా నిర్ణయాలు తీసుకోవటం లోనూ, కార్యాచరణ లోనూ అర్థవంతమైన ప్రజాస్వామిక, గౌరవప్రద సమాజం ముఖ్య ఉద్దేశం కావాలి. ఇందు కోసం సమాజం అన్ని రంగాలలోనూ వెంటనే స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక చర్యలు చేపట్టాలి.

విధానపర, కార్యక్రమ స్థాయిలలో ప్రధానంగా వీటిని కోరుకుంటున్నాం. వీటిని రెండవ భాగంలో క్లుప్తంగా పేర్కొని, 3వ భాగంలో వివరంగా ఇచ్చాం. నాల్గవ భాగంలో యువతకి సంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పేర్కొన్నాం.


వికల్ప్ సంగమ్‌ని సంప్రదించటానికి:

KJ Joy, joykjjoy2@gmail.com
Shrishtee Bajpai, shrishtee.bajpai@gmail.com
Yash Marwah, yash@letindiabreathe.org
Asmi Sharma, asmixsharma@gmail.com

భాగం 2: చర్యల సారాంశం

భారత దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ రంగాల వ్యవస్థలు, విధివిధానాలు, కార్యక్రమాలకు మౌలికంగా కొత్త రూపం ఇవ్వటానికి కింద పేర్కొన్న చర్యలు అవసరం.

1. ప్రభుత్వ అన్ని ప్రణాళికలు, బడ్జెట్లు, విధివిధానాలు, కార్యక్రమాలలో కుల, లింగ, లైంగిక దృక్పథం, వర్గ, జాతి మూలాలు, మతం/ విశ్వాసం, 'జాతి', వైకల్యం/ దివ్యాంగులు, అక్షరాస్యత, భౌగోళిక ప్రదేశం, ఇంకా ఇటువంటి ఇతర అంశాల కారణంగా వివక్షతకి గురయ్యే వాళ్లతో సహా సమాజంలోని అత్యంత బడుగు వర్గాల కోసం అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి. కార్పొరేట్ రంగంలో కూడా ఇటువంటి ప్రాధాన్యత ఉండేలా ప్రభుత్వం చూడాలి.

ప్రతి ప్రభుత్వ చర్యకి పరీక్ష*: దుర్బలులకు అది మేలు చేస్తుందా, వివక్షతను అది తగ్గిస్తుందా?*

2. భారతీయ సమాజం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక అసమానతలను పరిష్కరించటానికి కఠిన చర్యలు. ఇందులో జీతాల స్థాయికి పరిమితులు; అతి తక్కువ, అతి ఎక్కువ జీతాల మధ్య తేడాలను గణనీయంగా తగ్గించటం; ధనికుల ఆదాయం, సంపద, వారసత్వంపై అత్యధిక పన్ను; దుర్బలులకు కనీస మౌలిక ఆదాయం; ఉపాధి హామీ; ఉత్పత్తి (ప్రాథమిక) రంగంలోని కార్మికులు అందరికీ పెన్షన్; నిధులు అవసరం అయిన చోట అవి అందకుండా చేసే విపరీతమైన 'నల్ల డబ్బు'ని కట్టడి చేసే చర్యలు ఉండాలి.

ప్రతి ప్రభుత్వ చర్యకి పరీక్ష*: ఆర్థిక అసమానతలను తగ్గిస్తుందా, ప్రస్తుతం అంచులకు నెట్టివేయబడినవాళ్ల ఆర్థిక సాధికారీకరణకు దారి తీస్తుందా?*

3. వివిధ మతాలు, జాతి మూలాలు, భాషలు, సంస్కృతుల భిన్నత్వాన్ని కాపాడటానికి, వాటి మధ్య సామరస్యతను తిరిగి సాధించటానికి పాఠశాల స్థాయి నుంచి విస్తృత కార్యక్రమాలు చేపట్టటం, వివిధ సముదాయాల మధ్య తప్పుడు సమాచారం, విద్వేషం, శత్రుత్వాలను పెంచేవాళ్లపై వెంటనే చర్యలు చేపట్టటం.

ప్రతి ప్రభుత్వ చర్యకి పరీక్ష*: అది సామరస్యతను పెంచుతుందా, సామాజిక ఘర్షణలు, పొరపొచ్చాలను, ఉద్రిక్తతలనూ తగ్గిస్తుందా?*

4. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియని మరింత ప్రజాస్వామికంగా చేయటం, రాజ్యాంగంలోనూ, సంబంధిత చట్టాలలోనూ ఈపాటికే ఇచ్చిన అధికారాలు కాకుండా గ్రామ సభలకు, పట్టణ ప్రాంత వార్డు లేదా మొహల్లా సభలకు ఆర్థిక, చట్టపర అధికారాలతో సాధికారతను ఇచ్చి వాళ్ల పరిధిలో చేపట్టే కార్యక్రమాలకు

సంబంధించి ముందుగా అన్నీ తెలిసి, ఆమోదం తెలిపే ప్రక్రియలు అమలులో ఉండేలా చూడటం. నదీ పరీవాహక, ఉప-పరీవాహక ప్రాంతాల వంటి స్థాయిలలో నిర్ణయాలు తీసుకునే వేదికలను ప్రారంభించటం. ఇందులో యువత, మహిళలు, లైంగిక అల్ప సంఖ్యాకులు, దివ్యాంగులు, ఇతర బడుగు, బలహీనలకు ఇతర వర్గాల వాళ్లు 'ప్రాతినిధ్యం' వహించటం కాకుండా వాళ్లే అవసరమైన మద్దతుతో అన్ని విషయాలు తెలుసుకుని, భాగస్వాములు కావాలి.

ప్రతి ప్రభుత్వ చర్యకి పరీక్ష: *ప్రజల అందరి, ప్రత్యేకించి, ప్రస్తుతం అంచులకు నెట్టివేయబడిన వాళ్ల అర్థవంతమైన భాగస్వామ్యాన్ని అది పెంచుతుందా?*

5. ప్రభుత్వ అన్ని సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్పొరేట్ సంస్థలు, ఆర్థిక సంస్థలు, ప్రసార సంస్థల పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఒక సమగ్ర విధివిధానాన్ని, చట్టాన్ని చేయాలి. ప్రజాస్వామిక నిరసనని అణిచివేసే హక్కులను ప్రభుత్వానికి ఇచ్చే, పోలీసులు, సాయుధ పోలీసులకు నిరంకుశ అధికారాలను ఇచ్చే చట్టాలలోని అంశాలను తొలగించాలి.

ప్రతి ప్రభుత్వ చర్యకి పరీక్ష: *ప్రజలకు అది పూర్తి పారదర్శకంగా ఉందా, జవాబుదారీతనాన్ని పెంచుతుందా, జవాబుదారీతనం లేకుండా ప్రభుత్వం ప్రవర్తించే అధికారాన్ని తగ్గిస్తుందా?*

6. సాంప్రదాయ, ఆధునిక నైపుణ్యాలు, జ్ఞానాన్ని కలుపుతూ పెద్ద ఎత్తున జీవనోపాధుల కార్యక్రమాన్ని చేపట్టాలి. అత్యధిక జీవనోపాధిని కల్పించే వ్యవసాయ (వ్యవసాయం, పశు పోషణ, చేపల పెంపకం, అటవీ ఉత్పత్తులతో సహా), చేతి వృత్తులు/ చిన్న తరహా ఉత్పత్తి రంగాలకు అన్ని ప్రణాళికలు, బడ్జెట్లలో అత్యధిక ప్రాధాన్యతని ఇవ్వాలి. చిన్న లేదా మధ్య తరహా స్థాయిలో ఉత్పత్తి లేదా తయారు చేయగల అన్ని ఉత్పత్తులు, సేవలను సముదాయ ఆధారిత వికేంద్రీకృత ఉత్పత్తికి రిజర్వు చేయాలి, ఇందు కోసం ప్రజాస్వామికంగా నడిచే ఉత్పత్తిదారుల సంఘాలకు (సహకార సంఘాలు, కంపెనీలు, కార్మిక సంఘాలు) సహాయపడే చర్యలను చేపట్టాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష: *బలహీన, దుర్బల వర్గాల జీవనోపాధులను పెంపొందించి, వాటికి హామీని ఇస్తుందా, అన్ని జీవనోపాధులకు గౌరవప్రదమైన స్థానాన్ని ఇస్తుందా?*

7. దేశ సామాజిక-సాంస్కృతిక, వ్యవసాయ-జీవావరణ వైవిధ్యత ఆధారంగా భూమి/ నీరు వినియోగానికి ఒక జాతీయ ప్రణాళిక ఉండాలి; అందరి జీవితాలు (మానవులే కాకుండా ఇతర జీవులు) ఆధారపడి ఉన్న జీవావరణ వ్యవస్థలు, జీవావరణ విధులను, వాటిల్లో ఉండే ఉమ్మడి వనరులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యతను కాపాడటానికి అందులో భాగంగా చర్యలు తీసుకోవాలి. స్థానిక ఆర్థిక వ్యవస్థల కోసం సుస్థిర, సహజ వనరుల సంపదను సృష్టించే లక్ష్యంతో భూమి/ నేల, నీటి పునరుద్ధరణకు దేశ వ్యాప్త కార్యక్రమాన్ని చేపట్టాలి. అటవీ హక్కుల చట్టంలో మాదిరి సహజ జీవావరణ వ్యవస్థలు, జీవజాతుల

హక్కులను గుర్తించిన రాజ్యాంగ రీతిలో స్థానిక సముదాయాల హక్కులను గుర్తించి, వాటిని సశక్తీకరణ చేసే న్యాయ చర్యల ఆధారంగా ఇదంతా జరగాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష: సహజ జీవావరణ వ్యవస్థలను, జీవావరణ విధులను అది కాపాడుతుందా?

8. స్థానిక నుంచి జాతీయ స్థాయి వరకు అన్ని స్థాయిలలో జీవావరణ పరిమితులను ఆర్థిక ప్రణాళికలు గౌరవించే సమగ్ర విధాన, చట్టపర పాలనను తీసుకుని రావాలి. వివిధ ప్రాజెక్టుల, కార్యక్రమాల, పథకాల పర్యావరణ ప్రభావంపై ప్రజల భాగస్వామ్యంతో స్వతంత్ర సంస్థల ద్వారా సమగ్ర అంచనా జరగేలా చూడటం ఇందులో భాగం కావాలి. మానవ లేదా జీవావరణ/ జంతువుల ఆరోగ్యానికి హానికరమైన అన్ని రసాయనికాలు, పదార్థాలకు బదులుగా పర్యావరణ హిత పదార్థాలను వాడాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష: ప్రజలకి, వన్యప్రాణులకి కీలకమైన సహజ పర్యావరణాన్ని, జీవావరణ ఆరోగ్యాన్ని కాపాడుతందా? పీల్చటానికి శుభ్రమైన గాలి, తాగటానికి రక్షిత తాగు నీరు, మానసిక ఆరోగ్యానికి సురక్షిత ప్రదేశం అందరికీ అందుబాటులో ఉన్నాయా?

9. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, గృహ వసతి, విద్య, నీరు, ఆహారం, ఇంధనం, జీవనోపాధులు వంటి వాటితో సహా అన్ని మౌలిక వసతులకు ఇప్పటికంటే గణనీయంగా ఎక్కువ బడ్జెటు కేటాయించి వీటి కార్యక్రమాలకు ప్రభుత్వ మద్దతులో ప్రాధాన్యతను ఇవ్వాలి. అన్ని ఆహారాల ఉత్పత్తిని వ్యవసాయిక-జీవావరణ, భద్రమైన ప్రక్రియలుగా మార్చాలి. ఇందులో చిన్న రైతులకు, పశు పోషకులకు, చేపలు పట్టేవాళ్లకు నేల, విత్తనాలు, నీళ్లు, జ్ఞానం, ఇతర ఉమ్మడి వనరులపై వాళ్ల హక్కులకు పూర్తి మద్దతును ఇవ్వాలి. డిమాండును జీవావరణ పరిమితులకు, తప్పనిసరి అయిన వాటికి పరిమితం చేస్తూ 2030 నాటికి ఇంధన అవసరాలలో అత్యధిక శాతం వికేంద్రీకృత, పునరుద్ధరింపబడే వనరుల ద్వారా అందుబాటులోకి రావాలి. కీలక జీవన చర్యలకు ప్రాధాన్యతను ఇచ్చే నీటి వనరుల సంరక్షణ, పునరుద్ధరణకి వెంటనే చర్యలు చేపట్టాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష: అందరి, ప్రత్యేకించి ప్రస్తుతం అందుబాటులో లేని వాళ్లందరి మౌలిక అవసరాలు జీవావరణపరంగా సుస్థిరమైన పద్ధతులలో, ప్రజాస్వామిక, సముదాయ నియంత్రణ విధానాలలో అందుబాటుని పెంచి, హక్కుగా చేసి, ఆర్థికంగా భారంగా కాకుండా ఉంటుందా?

10. పట్టణ, గ్రామీణ ఆవాస ప్రాంతాలను గౌరవమైనవిగా, నివాస యోగ్యమైనవిగా, సుస్థిరమైనవిగా, మౌలిక అవసరాలకు సాధ్యమైనంతగా స్వయం సమృద్ధిగా చేసే చర్యలు చేపట్టాలి. సమాజంలోని దుర్బల వర్గాలకు భూమి, గృహ వసతి, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలి. సరుకు రవాణా/ ప్రయాణాలలో మోటారు లేని వాహనాల ద్వారా ప్రజా రవాణాకి అత్యధిక ప్రాధాన్యతని ఇవ్వాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష: అందరికి, ప్రత్యేకించి ప్రస్తుతం అందనివాళ్లకి నివాస యోగ్యమైన, సుస్థిర జీవన పరిస్థితులకు దారి తీస్తుందా?

11. విద్య, నేర్చుకోవడం అన్నవి కృత్యాధార పద్ధతులలో ఉండి సంతోషకరంగా ఉండాలి, వాళ్ల వాళ్ల సంస్కృతి, జీవావరణాలలో వేళ్లూనుకుని ఉండాలి (మాతృ భాషలో నేర్చుకోడానికి ప్రధాన్యతని ఇవ్వాలి). స్వయం నిర్ధారిత నేర్చుకునే ప్రక్రియలు, విమర్శనాత్మక ఆలోచన, ప్రశ్నించే తత్వం, ఆత్మావగాహన ద్వారా న్యాయం, బాధ్యత విలువలను విద్యార్థులు అంతర్గతం చేసుకునేలా ఉండాలి. అంతే కాకుండా సాంస్కృతిక వైవిధ్యత, జీవావరణ సుస్థిరత పట్ల గౌరవాన్ని పెంపొందించేలా ఉండాలి. ఇందుకు అవసరమైతే విద్యా హక్కు చట్టానికి సవరణలు చెయ్యాలి, పెద్దవాళ్లకి, పిల్లలకి సముదాయ ఆధారిత ప్రక్రియలను చేపట్టాలి. అంచులకు నెట్టివేయబడిన బృందాలకు సంబంధించిన ప్రత్యేక పాఠ్య ప్రణాళికను అన్ని స్థాయిలలో జోడించాలి. ప్రత్యేక అవసరాలు ఉన్న వాళ్లతో సహా అందరికీ విద్య పూర్తిగా అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయ ప్రసార విధానాలను అన్వేషించి, అమలు చేసి, ప్రోత్సహించాలి. జిడిపిలో కనీసం 6 శాతం ఈ రంగానికి కేటాయించాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష: గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికి, ప్రత్యేకించి ప్రస్తుతం అంచులకు నెట్టివేయబడిన వాళ్లకి సమగ్ర, పరిపూర్ణ నేర్చుకునే అవకాశాలకు అది దారి తీస్తుందా?

12. ఆవిష్కరణలు, సాంకేతిక విజ్ఞానం, జ్ఞానాలలో మరింత సమగ్ర విధివిధానం, కార్యక్రమాలు ఉండాలి. ఆవిష్కరణలలో ప్రజల, సాంప్రదాయం కాని పద్ధతులను ఇవి ప్రోత్సహించి, మద్దతు ఇవ్వాలి; స్వతంత్ర ప్రసార సాధనాల ద్వారా, ఇతరత్రా పద్ధతుల ద్వారా జ్ఞానం, సమాచారాలలో అత్యధిక భాగం అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి; జానపద ప్రజల జ్ఞానంతో సహా జ్ఞానానికి సంబంధించిన వైవిధ్యతను గుర్తించి, గౌరవించాలి; సాంకేతిక విజ్ఞానాన్ని ప్రజల సమీక్షకి పెట్టి అది న్యాయం, అందుబాటు, సుస్థిరత అన్న లక్ష్యాలకు ఎంతవరకు సహకరిస్తున్నాయో పరీక్షించాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష: మరింత ప్రజాస్వామికీకరణకు, జ్ఞానం, సాంకేతిక విజ్ఞానం ప్రజలకు మరింత అందుబాటులోకి రావటానికి దోహదం చేస్తుందా?

13. అందరికీ, ప్రత్యేకించి బలహీన వర్గాలకు ఆరోగ్యకరమైన జీవనం, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన కార్యక్రమాలు, సమగ్ర విధివిధానాన్ని రూపొందించాలి. ఇందులో పలు వైద్య విధానాల మధ్య సమన్వయం, ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే (ఆహార, సామాజిక, మానసిక, భౌతిక పర్యావరణం, విద్య వంటి) అన్ని అంశాలతో సంబంధాలు, సముదాయల పర్యవేక్షణ, పాలన ఉండాలి.

ప్రభుత్వ రంగం అందరికీ అందుబాటులోకి రావటానికి ఈ రంగానికి జిడిపిలో కనీసం 3 శాతం కేటాయించాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష*:* అందరికీ ఆరోగ్యం, ప్రత్యేకించి ప్రస్తుతం ఆరోగ్యకర పరిస్థితులు, ఆరోగ్య సేవలు అందని వాళ్లకి అందించేలా అది దోహదం చేస్తుందా*?*

14. కళలు (దృశ్య, ప్రదర్శన కళలు) ప్రజాస్వామికంగా విలసిల్లేలా ప్రోత్సాహక చర్యలు చేపట్టాలి, వాటిల్లో కొన్నింటిలో ఉన్న కుల, వర్గ, లింగ వివక్షతలను తొలగించాలి, అవి అందరికి అందుబాటులో ఉండేలా చెయ్యాలి, వాటిని ప్రోత్సహించటానికి ఉన్న ప్రభుత్వ సంస్థలను స్వతంత్ర సంస్థలుగా మార్చాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష*:* అందరికీ అందుబాటులో ఉండే విధంగా కళలు విలసిల్లటానికి దోహదం చేస్తుందా*?*

15. మానవ హక్కులు, శాంతి, నిస్సైనికీకరణల తోపాటు జీవావరణ విజ్ఞతల ఛాంపియన్‌గా ప్రపంచ స్థాయిలో భారత దేశ స్థానాన్ని తిరిగి స్థాపించే చర్యలు చేపట్టాలి, ఐక్యరాజ్య సమితిని తిరిగి బలోపేతం చేయాలి, ప్రపంచ స్థాయిలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో ప్రజలకు ప్రజాస్వామికంగా అందుబాటులో ఉండటానికి మద్దతు ఇవ్వాలి, వాణిజ్య, ఆర్థిక ఒప్పందాలు మానవ హక్కులకు, పర్యావరణ ఒడంబడికలకు లోబడి ఉండేలా చూడాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష*:* ప్రపంచ శాంతిని, సహ జీవనాన్ని, న్యాయాన్ని అది పెంపొందించుతుందా*?* ప్రపంచ స్థాయి నిర్ణయాలలో ప్రజల, సముదాయాల గొంతుకలు వినపడేలా అది దోహదం చేస్తుందా*?*

16. పైన పేర్కొన్న వాటన్నిటిలో భారత దేశ యువత, దివ్యాంగులు, సీనియర్ పౌరులు, మహిళలు, లైంగిక అల్పసంఖ్యాక వర్గాలు, దళితులు, ఆదీవాసీలు, ఇతరత్రా అంచుకి నెట్టివేయబడిన, దుర్బల వర్గాల సశక్తీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వర్తమానాన్ని, భవిష్యత్తుని నిర్ణయించుకోవటంలో వాళ్ల గొంతుకులకు ప్రాధాన్యతని ఇవ్వాలి. (యువత పై మూడవ భాగం చూడండి.)

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష*:* యువత, మహిళలు, అంచులకు నెట్టివేయబడిన ఇతర జెండర్‌లను, ఇతర దుర్బల ప్రజలను మరింత న్యాయం, స్వయం నిర్ణయ దిశగా సశక్తీకరణకు దోహదం చేస్తుందా*?*

భాగం 3: రంగాల వారీగా చర్యల వివరణలు

## సమాజం, సంస్కృతి, శాంతి

మతపరమైన, జాతిమూలాల మధ్య ఘర్షణలు, అసహనం ప్రమాదకరంగా విస్తరిస్తున్న పరిస్థితులను భారత దేశం ఎదుర్కుంటోంది. సాంస్కృతిక వైవిధ్యత, సహజీవనం ఆధారంగా ఏర్పడిన శతాబ్దాల నాటి సంస్కృతి తీవ్ర ముప్పులో ఉంది. అంచులకు నెట్టివేయబడిన వాళ్ల గొంతుకలను బలోపేతం చెయ్యటం లోనూ, లింగ, కుల, జాతి మూలాలు, ఇతర అంశాల ఆధారంగా అసమానతలను, వివక్షతను తగ్గించటం లోనూ గత కొద్ది దశాబ్దాలలో చెప్పుకోదగిన ప్రగతిని సాధించినప్పటికీ వాటి ప్రాతిపదికన హింస, వివక్షత ఇంకా కొనసాగుతున్నాయి; ముందు పేర్కొన్న వాటితో కలిసి విషపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. సహజీవనం, పరస్పర గౌరవాలు కొనసాగేలా, పెంపొందేలా, అసమానతలు, వివక్షతలు తగ్గేలా చెయ్యకుండా ప్రభుత్వం ఈ తిరోగమన ధోరణులను ప్రోత్సహిస్తోంది. ఇటీవలి కాలంలో అది లైంగిక హింసను సమర్థించింది, ప్రోత్సహించింది కూడా. చర్చలు, వైరుధ్యాల పరిష్కరణ, సహజీవనాన్ని పునరుద్ధరించటానికి ప్రజలు చేపట్టిన చర్యలు ఎన్నో ఉన్నాయి. వీటిల్లో కొన్నింటికి రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కూడా ఉంది. వీటి నుంచి ఎంతో నేర్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో తక్షణం చేపట్టవలసిన చర్యలు:

కులం, లింగ, లైంగిక తత్వం, వర్గం, జాతి మూలాలు, విశ్వాసం/ మతం, 'జాతి', వైకల్యం, అక్షరాస్యత, ప్రాంతం వంటి ఇతర అంశాలతో సహా వివిధ రకాల అసమానతలను, అసమతను, వివక్షతలను తొలగించాలి. అందరికీ గౌరవప్రదమైన జీవితాలను కల్పించటానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ఇటువంటి చర్యలు చేపట్టాలని చెపుతున్న భారత దేశ చట్టాలు, రాజ్యాంగంలోని అంశాలను మరింత బలంగా అమలు చెయ్యాలి. ఇప్పటికే అనేక రకాల ప్రయోజనాలు పొందుతున్న వర్గాలు ఈ అంశాలను దుర్వినియోగం చెయ్యకుండా అడ్డుకోవాలి. సహజీవనానికి ఆదరువు కల్పించిన భిన్న మతాలు, సంస్కృతులు, ఆలోచనల సమాగమాన్ని ప్రోత్సహించే సాంప్రదాయాలను, అలవాట్లను (ఉదాహరణకు భిన్న విశ్వాసాల వాళ్లు కలిసి జరుపుకునే పండగలను) ప్రోత్సహించాలి;

వివిధ మూల జాతులు, నమ్మకాలు, సంస్కృతులు, భాషలు, విశ్వాసాలు, సిద్ధాంతాలకు సంబంధించిన సముదాయాల మధ్య సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందించే, కొనసాగించే చర్యలను (ఉదాహరణకు వివిధ పండగలను అన్ని మతాల వాళ్లు కలిసి జరుపుకోవటం) ప్రోత్సహించాలి. ద్వేషాన్ని, అసహనాన్ని, పుకార్లను పెంచే, రెచ్చగొట్టే వాళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలి;
చిన్నప్పటి నుంచే వైవిధ్యత, బహుళత్వాల పట్ల అవగాహనని, గౌరవాన్ని పెంపొందించాలి, ఇందుకు బడులలో, ఇతర విద్యా కేంద్రాలలో పండగలు, ఇతర కార్యక్రమాలు అన్ని సముదాయాల వాళ్లు కలిపి జరుపుకోవటం వంటివి చేపట్టాలి;

అందరికి సమాన అవకాశాలు కల్పించి అన్ని రకాల సామాజిక వివక్షతల నుంచి రక్షణ కల్పించే వివక్ష వ్యతిరేక, సమానత్వ సమగ్ర చట్టాన్ని చేయాలి;

అంతరించిపోతున్న భాషలు, మాండలికాలను కాపాడటానికి (అవసరమైన చోట పునరుద్ధరించటానికి) తరాల మధ్య, వాటిని మాట్లాడే వారిలో ఇతర రూపాల ద్వారా, బడులలో, ఇతర విద్యా సంస్థలలో మాతృ భాషలో నేర్చుకోవటాన్ని తప్పనిసరి చేయాలి, అధికారిక కార్యక్రమాలలో ఇటువంటి భాషలను ఉపయోగించాలి, ఇటువంటి భాషలు, మాండిలకాలలో (అవసరమైన సందర్భాలలో) నిఘంటువులు వంటి పదజాల సహాయాలను రూపొందించటం వంటి వాటి ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలి, ఇటువంటి చర్యలకు రాజ్యాంగ, విధానపర అంశాలను జోడించాలి;

జనాభా గణనలో 6 మతాలను మాత్రమే చేర్చాలి అన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి, దానికి బదులుగా ఎంత చిన్నవైనా అన్ని విశ్వాసాలను గుర్తించి, ఇందులో చేర్చాలి; అదే విధంగా జనాభా గణనలో కులాన్ని తిరిగి చేర్చి, సంబంధిత కార్యక్రమాలు, పథకాలు సక్రమంగా అమలు అయ్యేలా సౌలభ్యపరచాలి;

ఇదే విధంగా అంతరించిపోతున్న వివిధ రకాల (దృశ్య, ప్రదర్శన వంటి) కళలను కొనసాగించటానికి లేదా పునరుద్ధరించటానికి తక్షణమే చర్యలు చేపట్టాలి, ఇందుకోసం ప్రభుత్వం ప్రారంభించిన సంబంధిత సంస్థలను స్వతంత్ర సంస్థలుగా మార్చి, ప్రభుత్వ ధనంతో నడపాలి;

ఘర్షణలు పరిష్కరించుకోటానికి, శాంతియుత సహజీవనాన్ని ప్రోత్సహించటానికి, ప్రత్యేకించి ఉద్రిక్తత, ఘర్షణపూరిత వాతావరణం ఉన్న ప్రాంతాలలో, సముదాయాల మధ్య అవగాహన, చర్చల కోసం వేదికలను ప్రోత్సహించాలి;

మహిళలకు రక్షణ, భద్రత ఉండేలా చూడాలి, చినప్పటి నుంచే పాఠ్య పుస్తకాల ద్వారా జెండర్ సున్నితత్వాన్ని పెంపొందించి అన్ని రకాల లైంగిక హింసను వ్యతిరేకించాలి, జెండర్ సమానత, గౌరవం కోసం పట్టణ, పల్లె ప్రాంతాలలో మొహల్లా స్థాయి వేదికలను ఏర్పాటు చేయాలి, వేతనం లేకుండా పని చేయించుకునే సంరక్షణ, ఇతర రకాల పనులను గుర్తించాలి, మహిళలను భాగస్వాములను చేసి పట్టణ, గ్రామీణ ప్రణాళికల తయారీలో స్త్రీల కోణాలను తీసుకుని రావాలి, వీధులలో రాత్రి వేళల విద్యుత్ దీపాలు ఉండాలి, వ్యక్తిగత/ ప్రజా మరుగుదొడ్ల సౌకర్యం, భద్రమైన ప్రజా రవాణా, భద్రమైన నడక/ సైకిల్‌పై వెళ్లే దారులు వంటి భౌతిక సదుపాయాలు.

అఫర్‌మేటివ్ చర్యలు, సాంఘిక సంక్షేమ కార్యక్రమాల అందుబాటు, బడ్జెట్లను పెంచాలి, ఉపాధి అవకాశాల ద్వారా జెండర్, లైంగిక అల్ప సంఖ్యాకులను కలుపుకోవాలి, వాళ్లకి సమాన అవకాశాలు ఇవ్వాలి. జెండర్ బడ్జెట్‌లో ట్రాన్స్‌జెండర్ బడ్జెట్‌ని చేర్చాలి.

ఎస్‌సి/ ఎస్‌టిలకు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు, దివ్యాంగులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో (ఈపాటికే కల్పించి ఉండకపోతే) ప్రత్యేక పన్ను రాయితీలు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు వంటి ప్రోత్సాహకాలను, ప్రత్యేక చర్యలను చేపట్టాలి, ఇందుకు అవసరం అయితే సామర్థ్యాలను పెంపొందించటానికి అవసరమైన శిక్షణ అందించాలి.

విద్యా సంస్థలలో న్యాయం, అహింస, నిరాడంబరత, గౌరవం, పరస్పరం ఆధారపడి ఉండాలి, దాతృత్వం, బాధ్యతాయుతం, ఉమ్మడితత్వం వంటి మౌలిక విలువలను పెంపొందించటాన్ని పునరుద్ధరించాలి, అయితే ఇందుకు పాత కాలం నాటి నీతి బోధన లాగా కాకుండా నేర్చుకోవటాన్ని ఆనందంతో ముడి వేసే కృత్యాలను చేపట్టాలి.

ప్రజాస్వామ్యం

*పౌరుల హక్కులు, హామీలతో సహా ప్రజాస్వామిక పాలన, పని చేయటానికి సంబంధించి కీలకమైన అంశాలు రాజ్యాంగంలో ఉన్నాయి. అయితే, పట్టణ, గ్రామీణ స్వయంపాలనకు వీటిని మరింత విస్తృతం చేయాలి, పౌరులు అందరి పూర్తి భాగస్వామ్యంతో మరింత బలంగా అమలు చేయాలి, వీటికి సంబంధించి ఇప్పటికే ఆచరణలో ఉన్న ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో నిరసనను తెలియచేసే హక్కును, వాక్ స్వాతంత్రాన్ని, సమావేశం అయ్యే హక్కును, ఇంకా రాజ్యాంగంలో అక్షర రూపంలో, స్ఫూర్తి రూపంలో పొందుపరిచిన హక్కులను అణిచివేయటం ద్వారా ప్రజాస్వామిక స్వేచ్ఛలను హరించి వేస్తున్న నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చెయ్యటానికి పూనుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సందర్భంగా అర్థవంతమైన స్వరాజ్ వైపు అడుగులు వెయ్యటానికి తక్షణ చర్యలు అవసరం, ఇందులో:*

రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక ప్రజాస్వామిక స్వేచ్ఛ, హక్కులను అన్ని ప్రజా వేదికలలో, చర్యలలో చాటాలి;

73వ, 74వ రాజ్యాంగ సవరణలు, సంబంధిత చట్టాలలో స్థానిక సంస్థలకు ఈపాటికే ఇచ్చిన హక్కుల తోపాటు ఆర్థిక, చట్టపర వికేంద్రీకరణకు మరిన్ని చర్యలు చేపట్టాలి;

స్వయం పాలనలో గ్రామ సభలకు (అంటే, పంచాయితీలకు మాత్రమే కాకుండా మొత్తం గ్రామ సమావేశానికి) పూర్తి అధికారాలు కల్పించాలి; అవసరమైన చోట పై వాటిని సంప్రదాయ పరిపాలన సంస్థలతో (ప్రత్యేకించి ఆదివాసీ/ గిరిజన ప్రాంతాలలో, లేదా కొండ ప్రాంత, దీవి సముదాయాలలో) మేళవించాలి, లేదా 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం వాటిని (సిక్కిం లోని డుస్మా వ్యవస్థ లాగా) గ్రామ సభ/ పంచాయితీలుగా గుర్తించాలి, వీటిల్లో లింగ, కుల లేదా ఇతర అంశాల ప్రాతిపదికగా ఉన్న అసమానతలను, వివక్షతలను తొలగించటానికి అంతర్గత సంస్కరణలు జరిగేలా సహాయపడాలి;

సభ్యులు అందరు ప్రత్యక్షంగా పాల్గొనటానికి అవరోధంగా ఉండే ప్రస్తుత పెద్ద పరిపాలన వ్యవస్థలకు లేదా వార్డ్ సభలకి దిగువన ప్రాంత లేదా మొహల్లా (పట్టణ పరిసర ప్రాంత) సభలకు స్వయం పరిపాలనకు పూర్తి అధికారాలను కల్పించాలి;

పైన పేర్కొన్న స్వయం పరిపాలన వేదికలలో అర్థవంతంగా పాల్గొనటానికి, సాధ్యమైనంతవరకు అందరికీ సమ్మతమైన నిర్ణయాలు తీసుకోటానికి అందరి పౌరుల సామర్థ్యాలను పెంపొందించాలి;

మహిళలు, లైంగిక అల్ప సంఖ్యాకులతో సహా నిర్ణయాలు తీసుకునే వేదికలకు ప్రస్తుతం దూరంగా ఉన్న వాళ్లందరికీ ప్రత్యేక సహాయాన్ని అందించాలి;

ప్రస్తుత జిల్లా, ఉప జిల్లా, లేదా రాష్ట్ర సరిహద్దులకు భిన్నంగా జీవావరణ, భౌగోళిక ఏకత్వం ఉన్న (నదీ పరీవాహక ప్రాంతాలు, ఉప పరీవాహక ప్రాంతాలు, ఒకే అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రాంతాలు వంటి విశాల ప్రాంతాల) 'జీవ సాంస్కృతిక' ప్రాంతాల పరిపాలన, ప్రణాళికా తయారీ, యాజమాన్య సంస్థలను మొదలు పెట్టాలి; ప్రస్తుత రాజకీయ సరిహద్దులను జీవావారణ, సాంస్కృతిక ఏకత్వానికి అనుగుణంగా ఉండేలా తిరిగి రూపొందించే ప్రక్రియను మొదలు పెట్టాలి;
ప్రజా ఉద్యమాలు, సహకార సంఘాలు వంటి వాటితో సహా పార్టీలతో సంబంధం లేని రాజకీయ ప్రజల సమీకరణను, సముదాయాలను ప్రోత్సహించాలి, సౌలభ్యపరచాలి;
అన్ని రాజకీయ సంస్థల పారదర్శకతను పెంపొందించటానికి ఆర్థిక మూలాలను, జమా ఖర్చు లెక్కలను ప్రజలకు వెల్లడించటం వంటి చర్యలను బలోపేతం చెయ్యాలి;

రాజ్యాంగ సంస్థలు, చట్టబద్ధంగా ఏర్పడిన సంస్థలు, అర్ధ-న్యాయ సంస్థల పారదర్శకతని, స్వయం ప్రతిపత్తిని ప్రోత్సహించటానికి నియామకాలలో పక్షపాతం లేకుండా, ఎంపిక ప్రక్రియలో పారదర్శకత ఉండాలి, వాటిపై అనవసర ప్రభావం చూపకుండా ఉండేలా వాటి కూర్పు, ఉద్యోగ నిబంధనలను నిర్ణయించాలి, ఇటువంటి సంస్థల పనిలో పారదర్శకతను కాపాడటానికి జవాబుదారీ విధానాలను బలోపేతం చేయాలి, వీటి స్వతంత్రత, ప్రభావవంతంగా పనిచేయటాన్ని పెంపొందించే చర్యలు అమలు చెయ్యాలి.

అంచులకు నెట్టివేయబడిన వర్గాల హక్కులు, న్యాయ పరిరక్షణలో, ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార రంగాల నియంత్రణలో, స్వయంగా సమకూర్చుకోలేని వాళ్లకు సంక్షేమాన్ని అందించటంలో ప్రభుత్వ అంగాలు పూర్తి జవాబుదారీతనాన్ని కలిగి ఉండేలా చూడాలి; వివిధ ప్రభుత్వ రంగాలు, పథకాల ఫలితాలు, లక్ష్యాలు, ప్రక్రియలకు సంబంధించి క్రమం తప్పకుండా, విశ్వసనీయ, బహిరంగ సమాచార విధానాన్ని చేపట్టాలి, ఇది ప్రజా తనిఖీ, విచారణల ద్వారా సరి చూడ గలిగేలా ఉండాలి;

ఆర్థిక వనరులను సమకూర్చుకోవటంలో వినూత్న పద్ధతులు, పిపిపి నమూనాల పేరుతో అత్యవసర ప్రజా సేవలు (రవాణా, వైద్యం, విద్య వంటివి) పేద ప్రజలకు అందుబాటులో లేకుండా చేసే ప్రైవేటీకరణ ధోరణిని ఆపాలి, వీటిని తిరిగి ప్రభుత్వ పరం చెయ్యాలి, ప్రభుత్వ రంగాలలో యువతకు ఉపాధి అవకాశాలను తిరిగి పెంచాలి, సామాజిక రంగాలకు బడ్జెటు కేటాయింపులను తగ్గించటానికి సాకులు చెప్పటం మానుకోవాలి;

ఇప్పటికే లేకపోతే, ప్రజల పూర్తి భాగస్వామ్యంతో, సంప్రదింపుల ప్రక్రియతో ఈ పత్రంలో పేర్కొన్న వివిధ ప్రాధమ్యాల కోసం విధివిధానాల చట్రాలను రూపొందించాలి;

పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడటానికి అన్ని చట్టాల, విధివిధానాల రూపకల్పనలో, సమీక్షలలో ప్రజలను సంప్రదించటం తప్పనిసరి చెయ్యాలి; ఇటువంటి ప్రక్రియలో గ్రామ సభ, పట్టణ వార్డ్ సభలు వంటి స్థానిక సంస్థల పాత్ర కీలకంగా ఉండేలా చూడాలి;

అన్ని సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు సమర్థంగా, పారదర్శకంగా, జవాబదారీతనంతో అమలు అయ్యేలా చూడటానికి సామాజిక తనిఖీలు, పౌర పర్యవేక్షణ విధానాలను తప్పనిసరి చేస్తూ చట్టాన్ని రూపొందించాలి;

పోలీసులకు, సైనిక దళాలకు అపరిమిత అధికారాలను ఇచ్చే, ప్రజాస్వామిక నిరసనను అణచి వేసే, నిరసనను తెలియచేసే పౌరులను తీవ్రవాదులు, దేశ ద్రోహులు వంటి పదాలతో ముద్రలు వేసే అప్రజాస్వామిక చట్టాలను, అంశాలను రద్దు చేయాలి; వాటికి బదులు ప్రజాస్వామికంగా పని చెయ్యటానికి దోహదం చేసే పౌర సమాజ చర్చా వేదికలను ప్రోత్సహించాలి;

పౌర సమాజ బృందాలతో సహా అన్ని సంస్థలు, వ్యవస్థలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, పారదర్శకతను ప్రోత్సహించాలి.

## జీవనోపాధులు, ఉపాధి

*నిరుద్యోగం, పూర్తి కాల ఉపాధి లేకపోవటం వంటి తీవ్ర సంక్షోభాన్ని భారత దేశం ఎదుర్కుంటోంది, ఆటోమేషన్ వల్ల ఇది మరింత తీవ్రం కావచ్చు. ఇంకోవైపున సాంప్రదాయకమైన వ్యవసాయం, చేతి వృత్తులు, కళలు వంటి వాటిల్లో పెద్ద ఎత్తున 'నైపుణ్యాలు కోల్పోతున్నా రు. దీనికి బదులుగా పారిశ్రామికరంగ భారీ ఉత్పత్తిలో రోజువారీ కూలీలుగా మారుతున్నా రు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' వంటి కార్యక్రమాలలో స్థానిక జీవనోపాధులకు కొన్ని కేటాయింపులు ఉన్నా స్థానిక స్వయం సమృద్ధతని కాదని, అంటే చిన్న స్థాయిలో సేవలు అందించేవాళ్లను, వ్యవసాయ ప్రాసెసింగ్‌తో సహా బయోమాస్ ఆధారిత గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిని, చేతి వృత్తులను, చిన్న తరహా ఉత్పత్తిదారులను కాదని పెద్ద వ్యాపారాలు, కార్పోరేషన్లపై ప్రధానంగా దృష్టి పెడుతున్నా యి. అర్థవంతమైన, గౌరవప్రదమైన, సరిపడా ఆదాయాన్ని ఇచ్చే ఉపాధులు, ఉద్యోగాలు ఇచ్చే వందలాది*

*ఉదాహరణలను సముదాయాలు, పౌర సమాజాలు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో చూపిస్తున్నాయి. కింద పేర్కొన్న చర్యలను తక్షణమే చేపట్టవలసిన అవసరం ఉంది*:

సాంప్రదాయ జీవనోపాధులు, వృత్తులను సముదాయాలు, వ్యక్తులు చేపట్టాలని అనుకున్నప్పుడు వాటి కొనసాగింపుకీ, నెరవేరటానికి (ప్రభుత్వ చర్యలలో) అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూనే వాటిల్లో వాళ్లు ఎదుర్కొంటూ ఉన్న కుల, లింగ, ఇతర రూపాలలో వివక్షతను తొలగించటానికి సహాయం చెయ్యాలి; ఇటువంటి వృత్తులలో వ్యవసాయం, పశువుల పెంపకం (సంచార లేదా స్థిర), అటవీ ఉత్పత్తులు, చేపలు పట్టటం, చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలు, సంప్రదాయ వైద్య విధానాలు ఉండవచ్చు (భారతీయులలో ఇంకా అధిక శాతం వీటిపై ఆధారపడి ఉన్నారని గుర్తించాలి); ఇటువంటి జీవనోపాధులలో కొనసాగాలని ప్రస్తుత లేదా కొత్త తరాలు అనుకున్నప్పుడు ఆర్థిక విలువ జోడింపు మార్గాలు, పురుషులు ఆధిపత్యంలో ఉన్న రంగాలలో మహిళల సాధికారత, భూమితో సహా సంబంధిత వనరులపై సముదాయ హక్కులను గుర్తించటం (అటవీ హక్కుల చట్టం కింద ఉమ్మడి అటవీ వనరుల నమూనాలో), కొత్త ఆవిష్కరణలను చేపట్టే, ప్రోత్సహించే వ్యవస్థలను ఏర్పరచటం వంటి వాటితో సహా ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించాలి;

చిన్న తరహా, మధ్య తరహా స్థాయిలో చేపట్టగల ఉత్పత్తులు, సేవలను సముదాయ ఆధారిత, వికేంద్రీకృత ఉత్పత్తికి రిజర్వు చేయాలి; ఇందుకు ఉత్పత్తిదారుల సముదాయాలు (సహకార సంఘాలు, కంపెనీలు, సంఘాలు వంటివి) వాటి సభ్యుల ద్వారా ప్రజాస్వామికంగా నడపటానికి దోహదపడే చర్యలు చేపట్టాలి, ఈ ఉత్పత్తులు, సేవలలో పెద్ద కార్పొరేషన్ల నియంత్రణను దశలవారీగా తొలగించాలి, ఇలాంటి ఉత్పత్తిదారులు ఉండే, గ్రామీణ, పట్టణ పరిసర ప్రాంతాలలో ఉత్పత్తి ప్రక్రియలను సౌలభ్యపరచాలి;

ఒకే రకమైన పనికి పురుషులు, స్త్రీలకు చెల్లించే వేతనంలో అసమానతలను తొలగించటానికి చర్యలు చేపట్టాలి;

జీత భత్యాలు ఒక స్థాయికి మించి, సగటు ఆదాయానికి రెట్టింపుకి మించకుండా చూసేలా చర్యలు చేపట్టాలి, శారీరిక, బౌద్ధిక శ్రమల వేతనాల మధ్య, వివిధ రకాల వృత్తుల మధ్య, ఒక సంస్థలో వివిధ స్థాయిల ఉద్యోగాల మధ్య తేడా చాలా తక్కువగా ఉండాలి;

నరేగా వంటి ప్రస్తుత ఉపాధి హామీ పథకాల పరిధిని విస్తృతం చేసి, పెంచాలి, పట్టణ పేద ప్రజలకు కనీస ఆర్థిక భద్రత కల్పించటానికి పట్టణ జీవనోపాధి హామీ పథకం వంటి కొత్త కార్యక్రమాలను ప్రవేశ పెట్టాలి. శ్రామికులు అందరికీ సార్వత్రిక కనీస పెన్షన్ చెల్లించేలా చూడాలి;

చివరి నెల జీతంలో సగం లేదా అతి తక్కువ నెల జీతంలో ఏది ఎక్కువైతే అంత మొత్తాన్ని సార్వత్రిక కనీస పెన్షన్‌గా చెల్లించేలా చూడాలి;

ఐక్య రాజ్య సమితి ప్రోత్సహిస్తున్న 'హరిత ఉపాధి', న్యాయమైన మార్పుల దార్శనికతకి అనుగుణంగా జీవావరణ పరంగా సున్నితమైన, సుస్థిరపరమైన, గౌరవప్రదమైన జీవనోపాధులను, ఉద్యోగాలను ప్రోత్సహించాలి;

ఆర్థిక విధానాన్ని సమగ్రంగా అర్థం చేసుకోటానికీ, (మహిళలు వంటి) దీర్ఘకాల సంరక్షణని ఇచ్చేవాళ్ల (వేతనంతో కూడిన సెలవు ఇచ్చి) సంక్షేమాన్ని పెంపొందించటానికీ సంరక్షణ పనిని జాతీయ జమా ఖర్చు లెక్కలలో చేర్చాలి; శిశు సంరక్షణ, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ భారం కాకుండా ఉండాలి, ప్రభుత్వ వైద్య, విద్యా వ్యవస్థలలో తగినంత పెట్టుబడులు పెట్టాలి;

ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను సకాలంలో భర్తీ చేయాలి; విద్య, వైద్యం, న్యాయ, కమిషన్‌లు, ఇతర అత్యవసర ప్రజా సేవలలో ఖాళీలను భర్తీ చెయ్యటానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి.

## ఆర్థికత, సాంకేతికత

భారత దేశ ఆర్థిక, సాంకేతిక రంగాలలో గతంలో ప్రభుత్వ రంగ ఆధిపత్యం ఉండేది. అయితే ఇటీవల, ప్రత్యేకించి 1991 తరవాత చేపట్టిన 'సంస్కరణల'తో ప్రైవేటు కార్పొరేషన్ల పట్టు బిగుస్తోంది. ఫలితంగా అసమానత్వం గణనీయంగా పెరిగింది, ఉత్పత్తి సాధనాల మీద ఎటువంటి నియంత్రణా లేని కోట్లాది కార్మికులు పరాయీకరణకు గురి అవుతున్నారు, వాళ్లు వినియోగిస్తున్న దాని మీద వినియోగదారులకు ఎలాంటి నియంత్రణా లేదు, సాంకేతిక విజ్ఞానాల జీవావరణ, సామాజిక ప్రభావాలకు సంబంధించి ఎటువంటి నియంత్రణలూ లేవు, లేదా చాలా బలహీనంగా ఉన్నాయి, తమ లాభాల కోసం భూములు, వనరులు, నిధులను అన్ని కార్పొరేషన్లు స్వేచ్ఛగా కొల్లగొడుతున్నాయి. ఇందుకు వ్యతిరేకంగా ఆర్థిక, సాంకేతిక అభివృద్ధిలో ప్రజలకు, జీవావరణానికి ప్రాధాన్యతని ఇచ్చే కార్యక్రమాలు కూడా ఉన్నాయి. మొత్తంగా ఉన్న సంక్షోభం, ప్రత్యామ్నాయ విధానాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో కింద పేర్కొన్న చర్యలతో సహా ఆర్థికత, సాంకేతికతపై ప్రభుత్వ, ప్రజాస్వామికి నియంత్రణను (ఆర్థిక స్వరాజ్) తిరిగి సాధించాలి:

మౌలిక అవసరాలు అన్నీ కొన్ని పదుల కిలోమీటర్ల లోపు నుంచి తీరే స్వయం సమృద్ధ, ఆత్మ నిర్భర సముదాయాలను నిర్మించాలన్న దీర్ఘ కాలిక లక్ష్యంతో సాధ్యమైనంత మేరకు అన్నీ రంగాలలో ఉత్పత్తి, వినిమయం స్థానికంగా జరిగేటట్టు చూడాలి (ఆహారం, ఇంధనం, నీళ్లు, ఇతర రంగాల వికేంద్రీకరణకు సంబంధించి కింద చూడండి);

శ్రామికుల, పర్యావరణ దోపిడీని, వివిధ రకాల గుత్తాధిపత్యాన్ని నిర్మూలించటానికి ప్రైవేటు కార్పొరేట్ రంగాన్ని గట్టిగా నియంత్రించాలి, అంతిమంగా ఇటువంటి ఉత్పత్తి అంతా అవసరమైన మద్దతుతో ప్రజాస్వామికంగా నడిచే ఉత్పత్తిదారుల సముదాయాల ద్వారా జరగాలి;

సముదాయ కరెన్సీలు, డబ్బులతో సంబంధం లేని వ్యవస్థలు, బహూకరించే ఆర్థికత, అన్ని పనులకు సమాన విలువ అన్న సిద్ధాంతం ఆధారంగా సమయాన్ని పంచుకోవటం అన్న వాటితో సహా స్థానిక, వికేంద్రీకృత మార్పిడి వ్యవస్థలను ఏర్పాటు చేయాలి, ప్రోత్సహించాలి;
మౌలిక అవసరాలలో స్థానిక స్వయం సమృద్ధత, ఆత్మ నిర్భరతని పణంగా పెట్టకుండా ఉండేలా పెద్ద ఎత్తున జరిగే వ్యాపార, ఆర్థిక లావాదేవీల నిర్వహణకు సూత్రాలను రూపొందించాలి;

ఆదాయాన్ని సమకూర్చుకోవటం లోనూ, ఆర్థికపర నిర్ణయాలు తీసుకోవటం లోనూ స్థానిక పరిపాలనా సంస్థలు, రాష్ట్రాల విత్త స్వతంత్ర ప్రతిపత్తికి దోహదం చేసేలా విత్త వికేంద్రీకరణను, సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చెయ్యాలి;
సరుకులు, సేవల ఉత్పత్తి ప్రక్రియలు అన్నిటిని పర్యావరణ సున్నితత్వం, సుస్థిరత వైపుకి మార్చాలి;

సహస్రాబ్దాలుగా 'సాధారణ' ప్రజలు కొత్త ఆవిష్కరణలు చేస్తూ ఉన్నారని, ఇదేమీ ఆధునిక, నియత సంస్థల గుత్తాధిపత్యం కాదని గుర్తించి ఉత్పత్తిదారులు, సముదాయాలలో ఆర్థిక, సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించాలి; డిజైన్, నైపుణ్యాలు, ఆవిష్కరణలకి సంబంధించిన ప్రస్తుత పథకాలను, మిషన్‌లను, వ్యవస్థలను, ప్రజాస్వామిక, వికేంద్రీకృత, అనియత విధానాలను ప్రోత్సహించి, గౌరవించేలా తిరిగి మలచాలి;

ఉత్పత్తి, రవాణా, సంబంధిత ఇతర ప్రక్రియలు జీవావరణ సుస్థిరత, సామాజిక-సాంస్కృతిక సున్నితత్వం వైపు మారేలా ఆవిష్కరణలను ప్రోత్సహించాలి;
ఆర్థిక సంక్షేమానికి కొలబద్దగా జిడిపిని తీసేసి దాని స్థానంలో వలస వ్యతిరేక, స్త్రీవాద, జీవావరణ విధానాలలో మూలాలు ఉన్న, భౌతిక, సామాజిక-ఆర్థిక, జీవావరణ సంక్షేమంతో కూడుకుని ఉన్న బహుముఖీన గుణాత్మక-సంఖ్యాత్మక కొలబద్దలను తీసుకుని రావాలి; ఇప్పటికే అందుబాటులో ఉన్న స్థూల జాతీయ సంతోషం, జాతీయ సంక్షేమ ఖాతాలు, నిజమైన ప్రగతి సూచికల నుంచి (ఒక్క సూచికను మాత్రమే ఉపయోగించటం అన్న పొరపాటు చేయకుండా) నేర్చుకుని, వైవిధ్యంతో కూడుకున్న భారతీయ పరిస్థితులు, జీవన విధానానికి తగ్గట్టుగా వాటిని మార్చుకోవాలి;

వృధా వినియోగాన్ని, వినియోగదారీతత్వ సంస్కృతులనీ ఇటువంటి ప్రవర్తనల వల్ల కలిగే ప్రభావాలను విస్తృతంగా ప్రచారం చేయటం ద్వారా, దానిని ప్రోత్సహించే పరిశ్రమలు, ప్రకటనలను నియంత్రించటం ద్వారా, సంపద పోగుబడటానికి పరిమితులను విధించే చర్యల ద్వారా (కింద చూడండి) జరిమానాలు విధించాలి, నిరుత్సాహ పరచాలి; ఆర్థిక విధానాన్ని ప్రజాస్వామిక నియంత్రణ, మానవ, జీవావరణ ఆరోగ్యం పట్ల సున్నితత్వం వైపు పయనింప చేయటంలో సహాయపడే వినియోగదారీ సముదాయాలను, సంఘాలను సౌలభ్యపరచాలి;

ఆదాయాలు/ జీతాల మీది పరిమితులు విధించాలి, అధిక స్థాయి ఆదాయాలు, సంపద, వారసత్వం మీద అధిక పన్ను వేయాలి. ప్రస్తుతం, 'దారిద్ర్య రేఖ'కి దిగువన లేదా దానికి కొంచెం పైన ఉన్న వాళ్లందరి మౌలిక ఆదాయాలను పెంచాలి, ప్రాథమిక రంగ ఉత్పత్తిదారులకు, సేవలు అందించేవాళ్లకు పెన్షన్ పథకాలు వంటి బలమైన, తక్షణ చర్యల ద్వారా భారత దేశాన్ని పీడిస్తున్న తీవ్ర ఆర్థిక అసమానతలను పరిష్కరించాలి; వ్యక్తిగత ఆస్తి, సంపదలను, వాటి వారసత్వాన్ని రద్దు చేయాలి లేదా నియంత్రించాల్సిన ఆవశ్యకతపై జాతీయ స్థాయి చర్చను చేపట్టాలి;

ప్రణాళిక తయారీ, బడ్జెట్ కేటాయింపులు, ఇతర స్థూల-ఆర్థిక విధివిధానాలు, చర్యలు అన్నీ జీవావరణ పరిమితులకు, సామాజిక-ఆర్థిక న్యాయం, సమానత అన్న లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా చూడాలి.

పైన పేర్కొన్న చర్యలలో చాలా వాటికి సంబంధం ఉన్నవి, విపరీతంగా పెరిగిపోయి ఆర్థిక, సమాజ అన్ని అంశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న 'చీకటి బజారు'ని నియంత్రించి, నిర్మూలించటానికి కఠిన చర్యలు చేపట్టాలి (లాభం, వడ్డీ, అద్దె, డివిడెండ్ వంటి ఆస్తుల ఆదాయాలపై ప్రత్యక్ష పన్నులను చెల్లించాలి కానీ, అలా చెల్లించటం లేదు); బ్యాంకింగ్ కార్యకలాపాలలో పారదర్శకత, కార్పొరేషన్ల స్థూల లాభాలపై పన్ను చర్యలు ఇందులో ఉండాలి.

## ఆహారం, నీళ్లు, ఇంధనం

వివిధ రంగాలలో దశాబ్దాలపాటు సాధించిన 'అభివృద్ధి', మౌలిక అవసరాలకు సంబంధించిన సంక్షేమ పథకాలు, కొన్ని ఖచ్చితమైన విజయాలు సాధించినప్పటికీ భారత దేశం ఇంకా ఆకలి, పోషకాహార లోపం, భద్రం కాని ఆహారం వంటి సంక్షోభాలను, శుభ్రమైన, రక్షిత తాగు నీరు అందుబాటులో లేకపోవటం, ఆధారపడదగిన, శుభ్రమైన ఇంధన వనరులు అందుబాటులో లేకపోవటం వంటి సమస్యలను ఎదుర్కుంటోంది. అంతే కాకుండా, ఆహారం, తాగు నీరు, ఇంధనాలను ఉత్పత్తి చేయటంలో, వాటిని అందచేయటంలో రక్షితం కాని, జీవావరణపరంగా ప్రమాదకరమైన విధానాలకు కోట్లాది ప్రజలు గురవుతున్నారు, ఆహారం, నీళ్లల్లో అనేక రకాల విష పదార్థాలు ఉంటున్నాయి. అయితే ఇంకొక వైపున జీవావరణ పరంగా సుస్థిరమైన పద్ధతులలో అంచులకు నెట్టివేయబడిన వాళ్లల్లో చాలామందికి ఇటువంటి మౌలిక అవసరాలను అందిస్తున్న ప్రజల చొరవలు ఎన్నో ఉన్నాయి, వీటిల్లో కొన్నింటికి రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు ఉంది. వీటి నుంచి మనం చాలా నేర్చుకోవచ్చు. ఈ సందర్భంగా కింద పేర్కొన్న తక్షణ చర్యలు అవసరం:

### ఆహారం

వ్యవసాయ భూములను వ్యవసాయ-జీవావరణ (సేంద్రియ/ సహజ పద్ధతులతో సహా) పద్ధతులలో, బయట నుంచి తెచ్చే ఉత్పాదకాలను తగ్గించి, నీటిని పొదుపు చేసే, చిన్న రైతుల ఆధారిత, జీవపరంగా వైవిధ్యమైన (స్థానిక చిరు ధాన్యాలు, అపరాలు, ఇతరాలను ప్రోత్సహించటం) పద్ధతులలో ఆహార ఉత్పత్తిని చేపట్టటాన్ని ప్రోత్సహించాలి, ప్రోత్సాహకాలను అందించాలి, ఇక్కడ విత్తనాలు, భూమి, జ్ఞానం వంటి ఉత్పత్తి సాధనాల మీద రైతుకి సార్వభౌమికత ఉంటుంది (అన్న స్వరాజ్‌ని సాధించటానికి ఇది సహాయపడుతుంది); ఇటువంటి మార్పునకు సహకరించేలా ఆహార భద్రతా చట్టాన్ని ఆహార సార్వభౌమ్య చట్టంగా మార్చాలి, రసాయనిక ఎరువులకు ఇచ్చే సబ్సిడీలు అన్నింటినీ స్వయం సమృద్ధత సాధించేంత వరకు రైతులకు బదిలీ చెయ్యాలి; 2040 నాటికి భారత దేశం 100 శాతం సేంద్రియ పద్ధతుల్లో ఆహార ఉత్పత్తిని చేపట్టాలి అన్న లక్ష్యాన్ని పెట్టుకోవాలి, ఈలోగా దశల వారీగా రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గిస్తూ వాటికి బదులుగా బాహ్య ఉత్పాదకాల అవసరం తక్కువగా ఉండే పద్ధతులను పాటించాలి;

పట్టణాలలో జంక్ ఆహారం తినటం తప్పించి వేరే మార్గం లేని శ్రామిక ప్రజలతో సహా ఆర్థికంగా అంచులకు నెట్టివేయబడిన సముదాయాలకు సరసమైన ధరలలో సేంద్రియ, ఆరోగ్యకరమైన ఆహారం (చిరు ధాన్యాలు, అపరాలు, పళ్లు, కూరగాయలతో సహా) అందుబాటులో ఉండేలా సౌలభ్యపరచాలి, ఇందు కోసం భద్రం కాని ఆహారానికి సబ్సిడీలు తొలగించాలి, అవసరమైన చోట తాత్కాలికంగా భద్రమైన/ ఆరోగ్యకరమైన పోషకాహారానికి సబ్సిడీలు అందించాలి; వీటిని చౌక ధరల దుకాణాల ద్వారా, మధ్యాహ్న భోజన పథకాల ద్వారా, పేదలకు ఆహారం అందించే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమాల ద్వారా అందించాలి; భారత దేశంలోని వైవిధ్యభరిత వంటలు, ఆహారాల విలువ, ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించాలి, జంక్ ఫుడ్‌కి వ్యతిరేకంగా చిరు ధాన్యాల వంటి వైవిధ్య పోషక ఆహారాలను, 'స్లో ఫుడ్'ని ప్రోత్సహించాలి, ఆహార సంస్కృతులు, అలవాట్లను ఒకే రకంగా మార్చటాన్ని, కుల ఆధారిత ఆహారంలో తారతమ్యాలను రుద్దటాన్ని వ్యతిరేకించాలి;
సాగు చెయ్యకుండానే లభించే పదార్థాల వినియోగాన్ని ఆహారంలో కొనసాగించటాన్ని, పునరుద్ధరించటాన్ని ప్రోత్సహించాలి, అయితే వీటి వినియోగం సుస్థిర పద్ధతులలో ఉండేలా చూడాలి;

పరస్పర గౌరవం, నమ్మకాల ఆధారంగా ఆహార ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య సంబంధాలను సౌలభ్యపరచాలి; ఆహార అవసరాలను తీర్చటానికి స్థానిక వ్యాపారాన్ని సాధ్యమైనంతవరకు ప్రోత్సహించాలి, ఇద్దరికీ ఆమోదయోగ్యమైన ధరను నిర్ణయించటంలో సహాయపడాలి;

రైతుకి న్యాయమైన ధర లభించటానికి సహాయపడని మార్కెట్ పరిస్థితులలో వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను అందించాలి.

నీళ్లు

సంబంధిత అన్ని విధివిధానాలు, కార్యక్రమాలలో (ఇక్కడ పేర్కొన్న ప్రాధమ్య క్రమంలో) నీటి వినియోగంలో ఈ ప్రాధమ్యాలను ఏర్పరిచి, అమలు చెయ్యాలి: జీవనం కోసం నీళ్లు (తాగు నీరు, శుభ్రత, పారిశుద్ధ్యం, పశుపోషణ, వన్య ప్రాణులు), జీవావరణ వ్యవస్థల విధులు, అవసరాలు, జీవనోపాధులు (ఆహార ఉత్పత్తితో సహా), మార్పులకు (వాతావరణ, భూ వినియోగ, జీవనోపాధులు వంటివి) సర్దుకుని, అలవాటు పడాలి, పారిశ్రామిక/ మౌలిక సదుపాయాలకు వినియోగం; విలాసవంత, వ్యర్థ వినియోగాలను కట్టడి చేసేలా నీటి వినియోగ డిమాండును నిర్వహించాలి, ఖచ్చితమైన కొరతలు ఉంటే తప్పించి నీటి సరఫరాని బయట నుంచి చెయ్య కూడదు;

నీటిని ఒడిసిపట్టటం, నిర్వహణ, వినియోగానికి పెద్ద, పెద్ద ప్రాజెక్టులు, కేంద్రీకృత నిర్వహణ కాకుండా వికేంద్రీకృత విధానాలకు ప్రాధమ్యాన్ని ఇవ్వాలి, ఇందులో సాంప్రదాయ, ఆధునిక జ్ఞానాన్ని సరిగా మేళవించాలి;

బాడవ భూములు, నీటి వనరుల పునరుద్ధరణ, మరమ్మతు, కాలుష్యాన్ని తొలగించటం వంటి వాటికి విస్తృత మద్దతును అందించాలి (సాధ్యమైన సందర్భాలలో పెద్ద ప్రాజెక్టులను డీకమిషన్ చెయ్యటంతో సహా), వాటి పరీవాహక ప్రాంతాల సంరక్షణ, పునరుద్ధరణ చేపట్టాలి;

సముదాయ ఆధారిత పరిపాలనా విధానాల ద్వారా నీటి సమ పంపిణీ జరిగేలా చూడాలి, నీటి కేటాయింపు, నిర్వహణ, అందుబాటులలో లింగ పరమైన తేడాలు లేకుండా చూడాలి; ఇటువంటి పద్ధతుల ద్వారా (భూ గర్భ జలాలతో సహా) నీటిని నియంత్రించటానికి చర్యలను చేపట్టాలి;

సమర్థమైన చర్యలు, సమాన నీటి పంపిణి, డిమాండు నిర్వహణ, రీసైకిల్, తిరిగి వినియోగం ద్వారా గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వంటి వివిధ వినియోగాల నీటి ఫుట్‌ప్రింట్‌ని తగ్గించాలి;

నదుల అనుసంధానం, అంతర్గత జల మార్గాలు, పెద్ద జల విద్యుత్ ప్రాజెక్టులు జీవితాలను, జీవనోపాధులను, మిగిలిన ప్రకృతిని విధ్వంసం చేస్తాయి కాబట్టి ఇటువంటి మౌలిక సదుపాయాల పెద్ద ప్రాజెక్టులను తిరిగి సమీక్షించాలి; వీటికి బదులు మరింత సుస్థిరమైన, వాతావరణ హితమైనవే కాకుండా సంబంధిత అందరి ప్రజల భాగస్వామ్యంతో తక్కువ ఖర్చుతో చేసే వాటిని ప్రోత్సహించాలి;

వాతావరణ మార్పునకు అనువుగా మారటం అన్న పేరుతో హస్వ దృష్టితో ఇతర జీవావరణ సమస్యలను సృష్టించే నదులను లోతు, వెడల్పు చేయటం, ఒంకరలు తీసి తిన్నగా చేయటం వంటి ప్రాజెక్టులను ఆపివెయ్యాలి;

ప్రైవేటీకరణకు వీలు కాని ఉమ్మడి వనరులుగా నీటిని, నీటి వనరులను చూడాలి; ఈ మేరకు చట్టాలు, రాజ్యాంగంలో అవసరమైన అంశాలను చేర్చాలి;

వివిధ స్థాయిలలో (మన నదులలో చాలా వరకు సరిహద్దులకు అతీతంగా ఉంటాయి కాబట్టి వాటితో సంబంధం లేకుండా మైక్రో-వాటర్‌షెడ్, సబ్-బేసిన్, బేసిన్) సంస్థలను ఏర్పాటు చెయ్యాలి, వైరుధ్యాలను పరిష్కరించటానికి, సంప్రదింపులకు గణాంకాలు, సమాచారం, అనుభవాలను పంచుకునే చట్టబద్ధ, ప్రజాస్వామిక, వ్యవస్థాగత ప్రదేశాలుగా ఇవి ఉపయోగపడాలి;

గంగా, యమున నదుల హక్కులను ఉత్తరాఖండ్ హై కోర్టు గుర్తించిన విధంగా స్వతంత్ర వ్యవస్థలుగా నదులు, చెరువులు వంటి అన్ని నీటి వనరుల హక్కులను గుర్తించాలి.

ఇంధనం

ఇంధన వ్యర్థ వినియోగాన్ని అరికడుతూ డిమాండు నిర్వహణకు బలమైన విధానాన్ని అమలు చెయ్యాలి, ఇంధన ఉత్పత్తి జీవావరణపరంగా సుస్థిరంగా ఉండే పరిధిని అంచనై వేసి దానిని దాటకూడదు; ఇంధన సంరక్షణ, పొదుపులను ప్రోత్సహించి, వృధా చేసే పరికరాలు, పదార్థాలకు బదులుగా సమర్థమైన వాటిని ఉపయోగించాలి;

సాంప్రదాయ వనరులు, ఉత్పత్తికి కాకుండా వికేంద్రీకృత, పునరుద్ధరింపబడే, భాగస్వామ్య యాజమాన్యంలో ఇంధన వనరులు, ఉత్పత్తిని, గ్రిడ్‌లకు ప్రాథమ్యం ఇవ్వాలి; 2030 నాటికి శిలాజ ఇంధనాలు, అణు శక్తి ఆధారిత ఇంధనాన్ని పూర్తిగా తొలగించి వాటి స్థానంలో పునరుద్ధరింపబడే ఇంధన వనరులను వినియోగించాలి; కొత్త, పెద్ద జల విద్యుత్ ప్రాజెక్టుల అవసరం లేకుండా, లేదా వాటి అవసరాన్ని గణనీయంగా తగ్గించేలా ప్రస్తుతం నెలకొల్పిన జల విద్యుత్ సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగించాలి; అంతిమంగా పెద్ద జల విద్యుత్ ప్రాజెక్టులను నిషేధించాలి;

ఇంధనం అందరికీ సమంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి; ప్రస్తుతం దీనిని విలాసాల కోసం ఉపయోగిస్తున్న వారి నుంచి మళ్లించి మౌలిక అవసరాలకు చాలినంత లేని వాళ్లకి అందించాలి;

బయోమాస్ ఆధారిత, సాంప్రదాయ సాంకేతిక విజ్ఞానాలైన నీటి మరలు వంటి వాటిని, అవసరం అయితే మెరుగుపరిచి, విద్యుత్తేతర ఇంధనాలను, ఇంధనాలు వాడకుండానే ఇల్లు వేడిగా లేదా చల్లగా ఉండేలా చేసే డిజైన్లను ప్రోత్సహించాలి;

ఉత్పత్తి, పంపిణీలను సాధ్యమైనంతగా చేసి వాటి ఖర్చులను సమంగా పంచాలి, సామర్థ్యాన్ని పెంచాలి, ప్రభుత్వ సంస్థలను జవాబుదారీగా చెయ్యాలి, ఇంధన ప్రణాళికలలో అంచులకు నెట్టివేయబడిన వాళ్ల అవసరాలను చేర్చాలి.

## ఆరోగ్యం, పారిశుద్ధ్యం

వైద్య రంగం ప్రైవేటీకరణ పెరుగుతుండటంతో నివారణ, చికిత్స సేవలు, తగినంత మోతాదులో పోషకాహారం, తాగు నీళ్లు సరిగా అందకపోవటం, రసాయనిక కాలుష్యాలకు మరింతగా గురి అవుతూ ఉండటం, సామాజిక వాతావరణం ఘర్షణలతో నిండి ఉండటం, ప్రకృతి నుంచి లభించే ఉచిత, చవక పోషకాహారాలు, మూలికల అందుబాటు వేగంగా తగ్గిపోవటం, జంక్ ఆహారాలు, పానీయాలను బాధ్యతారాహిత్యంగా ప్రోత్సహించటం, 'పేదరికపు జబ్బులు' కొనసాగుతూ 'సంపన్నుల డబ్బులు' జతకావటం, మానసిక ఆరోగ్య సమస్యలు తీవ్ర స్థాయికి చేరుకోవటం, బహుముఖీన ఆరోగ్య సేవలను ప్రత్యేకించి ఆయుష్, ప్రజల పద్ధతులను అంతగా ప్రోత్సహించక పోవటం వల్ల సమాజంలోని దుర్బల వర్గాలు తీవ్ర ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కుంటున్నాయి. కొవిడ్ మహమ్మారి సమయంలోప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ తగినంతగా లేదన్న విషయం బహిర్గతం అయ్యింది. భారత దేశ కుటుంబాలు ఆరోగ్య సంబంధిత అంశాలపై దాదాపు 12000 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తాయని ఒక అంచనా. ఈ ఖర్చులో దగ్గర దగ్గర 55 శాతం కుటుంబాలు సొంతంగా పెట్టుకుంటాయి. అయితే, కోవిడ్‌కి ముందు, తరవాత కూడా అనారోగ్యాన్ని నివారించటానికి, చికిత్సలు అందించటానికి సముదాయాలు, పౌర సమాజం, కొన్ని ప్రభుత్వ సంస్థల నేతృత్వంలో ప్రజా ఆరోగ్య సేవలు సాధించిన విజయాలకు ఎన్నో ఉదాహరణలు కూడా ఉన్నాయి. వీటి నుంచి నేర్చుకుంటూ తక్షణమే కింద పేర్కొన్న చర్యలను చేపట్టాలి:

ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే సామాజిక అంశాలైన పోషకాహారం, నీళ్లు, పారిశుద్ధ్యం, మానసిక ఆరోగ్యం, శుభ్రమైన పర్యావరణం, భద్రమైన రవాణా, ఆరోగ్యకరమైన సామాజిక వాతావరణం వంటి వాటిని మెరుగుపరచటం ద్వారా; అనారోగ్యానికి కారణం అయ్యే వాణిజ్యపరమైన (సిగరెట్లు, బాగా ప్రాసెస్ చేసిన ఆహారాల తోపాటు లాభాల కోసం కార్పొరేషన్లు, ఇతరులు ప్రోత్సహించే) అంశాలను సవాలు చెయ్యటం ద్వారా; శరీరం గురించి, ఆరోగ్యం గురించి కాలానికి నిలిచిన సాంప్రదాయ జ్ఞానం, నిరూపితం అయిన ఆధునిక జ్ఞానాలను ప్రోత్సహించటం ద్వారా, తమ ఆరోగ్యానికి తామే బాధ్యత వహించేలా ప్రజల సాధికారీకరణకు దోహదం చేయటం ద్వారా; ఆరోగ్య, పోషకాహార, వైద్య శిక్షణ సంస్థల పాఠ్య ప్రణాళికలలో వీటన్నింటినీ భాగం చెయ్యటం ద్వారా అనారోగ్యాన్ని నివారించటానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి; సాంప్రదాయంగా చికిత్స/ రోగ లక్షణ సేవలు అందుబాటులో లేని వారికి అవి అందేలా చూడాలి, ఇందుకు ప్రభుత్వ వైద్య సేవలను సమర్థంగా అందించాలి, పౌరుల పట్ల ప్రభుత్వ బాధ్యతలో జవాబుదారీతనంతో ఉండాలి;

వైద్యం ద్వారా అతిగా జోక్యం చేసుకునే చట్రాన్ని పక్కకు పెట్టాలి, వైద్య చర్యలకు ఉన్న పరిమితులను ఒప్పుకోవాలి;

సాంప్రదాయ, ఆధునిక వైద్య వ్యవస్థలను సమగ్రపరిచి, బహుళ విధానాన్ని సౌలభ్య పరచాలి, దేశీయ/ ప్రజా మందులు, ప్రకృతి చికిత్స, ఆయుర్వేదం, యునాని, ఇతర సమగ్ర విధానాలతో సహా

వైవిధ్యభరితమైన భారతీయ, విదేశీ విధానాలను జనాదరణ పొందేలా చేయాలి; ప్రతి క్లినిక్, ఆసుపత్రి, ఇతర వైద్య సంస్థలలో పలు వైద్య విధానాలు అందుబాటులో ఉండేలా చూడాలి;
ఆరోగ్య సేవలు, పారిశుద్ధ్యాలు సముదాయ ఆధారిత నియంత్రణ, నిర్వహణలో ఉండేలా చూడాలి, వ్యక్తిగత, ఉమ్మడి బాధ్యతలతో ఆరోగ్యకరమైన పరిసరాలు ఉండేలా చూడాలి, యువతకు, దుర్బలులకు భద్రమైన ప్రదేశాలను కల్పించటం, మానవ, ఇతర వ్యర్థాల నిర్వహణలో కుల ఆధారిత విధానాన్ని నిర్మూలించటం వంటివి సాధించాలి;

ఆసుపత్రులు, వైద్య సేవలలో తగినంత సిబ్బంది ఉండేలా చూసి వాటి అందుబాటుని పెంచటం ద్వారా ప్రస్తుత ప్రభుత్వ వైద్య మౌలిక సదుపాయాలను పెంచి, మెరుగుపరచాలి. వైద్యానికి అయ్యే ఖర్చులు విపరీతంగా పెరిగిపోకుండా ప్రైవేటు ఆసుపత్రులలో రుసుములపై పరిమితులు విధించి, అమలు చేయటం ద్వారా వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండే లాగా చూడాలి.
పైన పేర్కొన్న పనులకు జిడిపిలో కనీసం 3 శాతం కేటాయించాలి.

## పర్యావరణం, జీవావరణం, వాతావరణం

విధ్వంసకర అభివృద్ధి ప్రాజెక్టులు, వ్యాపారీకరణ, సరిగా లేని కేంద్రీకృత పరిపాలన, నిర్ణయాలు తీసుకోవటంలో, యాజమాన్యంలో అర్థవంతంగా ప్రజలు పాల్గొనే వీలు లేకపోవటం, కొన్ని జనాభా ధోరణులు కారణంగా గత కొద్ది దశాబ్దాలలో సహజ జీవావరణ వ్యవస్థలకు, జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి పెద్ద ఎత్తున, విస్తృతంగా సరి చెయ్యలేని నష్టం జరిగింది. 1991లో ఆర్థిక 'సంస్కరణలు' చేపట్టినప్పటి నుంచి ఎంతో కష్టపడి సాధించుకున్న పర్యావరణ చట్టాలు, ప్రక్రియలను నీరుగార్చారు, లేదా పక్కన పెట్టేశారు, ఈ ప్రక్రియ గత కొద్ది సంవత్సరాలలో మరింత తీవ్రతరం అయ్యింది (ఉదాహరణకి అటవీ, జీవ వైవిధ్యత, ఇతర పర్యావరణ చట్టాలలో మార్పులు). ఇటీవల కాలంలో వాతావరణ సంక్షోభం కారణంగా పరిస్థితులు మరింత తీవ్రతరం అయ్యి, లక్షలాది ప్రజలను, ప్రత్యేకించి ప్రాథమిక ఉత్పత్తి రంగంలోనూ, సేవల రీత్యా బయట పని చేస్తున్న వాళ్లను ప్రభావితం చేస్తోంది. 'ప్రకృతి' వైపరీత్యాలు అంటున్నవి పెరుగుతున్నాయి, వీటిని నివారించటానికి, అవి సంభవించినప్పుడు వాటిని ఎదుర్కోటానికి చేపడుతున్న చర్యలు అరకొరగా ఉంటున్నాయి. పర్యావరణం, వాతావరణ మార్పునకు అలవాటు పడాలి, వైపరీత్యాలకు స్పందించటం వంటి వాటికి బడ్జెట్ కేటాయింపులు చాలా తక్కువగా ఉంటున్నాయి, దళితులు, ఆదివాసీలు, భూమి లేని వ్యవసాయ కూలీలు, అసంఘటిత రోజు వారీ కూలీలు, దివ్యాంగులు, మహిళలు, పిల్లలతో సహా అంచులకు నెట్టివేయబడిన వర్గాల కోసం ప్రత్యేక కేటాయింపులు లేవు. ఇంకొక వైపున జీవ వైవిధ్యత సంరక్షణ, జీవావరణ పునరుద్ధరణ, క్షీణతను నివారించటం, వాతావరణ మార్పు, వైపరీత్యాలను తట్టుకోవటం వంటి వాటిల్లో ప్రధాన స్రవంతికి మినహాయింపులుగా దేశ వ్యాప్తంగా సముదాయాల ఆధ్వర్యంలో విజయవంతమైన వందలాది ఉదాహరణలు ఉన్నాయి. ఈ సందర్భంగా కింద పేర్కొన్న దిశలో తక్షణ చర్యలు అవసరం:

దేశం మొత్తానికి, అందులోని వివిధ ప్రాంతాలకి జీవావరణ పరిమితులు, క్యారీయింగ్ కపాసిటీలను (అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంప్రదాయ, ఆధునిక జ్ఞానాన్ని ఉపయోగించి) నిర్ధారించటానికి స్వతంత్ర అధ్యయనాలను సౌలభ్యపరచాలి, ఆ ఫలితాలను విస్తృతంగా ప్రచారం చెయ్యాలి;

స్థానిక నుంచి జాతీయ వరకు అన్ని స్థాయిలలో ఆర్థిక ప్రణాళికలు ఈ పరిమితులను గౌరవించేలా చూడాలి, ప్రాజెక్టుల (మౌలిక సదుపాయాలతో సహా), కార్యక్రమాల, పథకాల, రంగాల (ప్రస్తుతం మినహాయింపు ఉన్న పెద్ద స్థాయి పునరుద్ధరింపబడే ఇంధన ప్రాజెక్టులతో సహా) సమగ్ర పర్యావరణ ప్రభావ అంచనాలను భాగస్వామ్య పద్ధతులతో స్వతంత్ర సంస్థలతో నిర్వహించాలి; ఇటువంటి అంచనాలకు అయ్యే ఖర్చును ప్రాజెక్టును ప్రతిపాదించిన వాళ్లు లేదా సంబంధిత మంత్రిత్వ శాఖలు/ సంస్థలు భరించటం కాకుండా కోర్ బడ్జెట్ నుంచి భరించాలి;

సహజ జీవావరణ వ్యవస్థలు, జీవ వైవిధ్యత, వన్య జీవుల సంఖ్య (ఆపాటికే ముప్పును ఎదుర్కొంటున్న వాటిపై ప్రత్యేక దృష్టి పెడుతూ) సమగ్రత, సుస్థిరతలను కాపాడటానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి; అన్నీ సంరక్షణ చర్యలు సముదాయాల ఆధారంగా ఉండేలా తిరిగి రూపొందించాలి (ఇందుకు అటవీ హక్కుల చట్టం కింద ఏర్పాటు చేస్తున్న నమూనాలను ఉపయోగించుకోవాలి, అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంప్రదాయ, ఆధునిక జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి;

ప్రజలు ఆధారపడే అడవులు, బాడవ భూములు, గడ్డి భూములు, సముద్ర తీరాలు, తీర ప్రాంతాలు వంటి ఇతర జీవావరణ వ్యవస్థలు ఉమ్మడి వనరులగా కొనసాగాలి (లేదా తిరిగి ఉమ్మడి వనరులుగా చెయ్యాలి), ఇవి గ్రామ సభ, మొహల్లా సభ, లేదా సాంప్రదాయ పరిపాలనా సంస్థలు వంటి ప్రజాస్వామిక సముదాయ వ్యవస్థల నిర్వహణలో ఉండాలి, ఆయా ఉమ్మడి వనరులపై అత్యధికంగా ఆధారపడిన మహిళా బృందాలు వంటివి ఇందులో కీలక పాత్ర పోషించాలి;

జీవ వైవిధ్యత నష్టం, వాతావరణ సంక్షోభం, విష పదార్థాలు, కాలుష్యాలు వంటి వాటితో సహా ప్రపంచ జీవావరణ సమస్యలకు భారత దేశం ఏ మేరకు కారణం అవుతోందో అంచనా వేయాలి, ఈ సమస్యలకు ప్రధాన కారకులైన ఇతర దేశాలు చర్యలు తీసుకోవాలని కోరుతూనే బాధ్యతాయుత ప్రపంచ పౌరులుగా మనం కూడా తగిన చర్యలు తీసుకోవాలి;

భారత దేశ జీవ వైవిధ్యత మీద ప్రస్తుత, ముందు ముందు రాబోయే ప్రపంచ జీవావరణ సమస్యలు చూపే ప్రభావాన్ని అంచనా వేయాలి, ఈ ప్రభావాలను తగ్గించటానికి తక్షణ చర్యలు చేపట్టాలి, అప్పటికే అంచులకు నెట్టివేయబడిన ప్రజలను ప్రభావితం చేస్తున్న, చేయనున్న వాటికి ప్రాధాన్యతని ఇవ్వాలి;

వాతావరణ మార్పుపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్ఏపిసిసి), రాష్ట్రాల వాతావరణ కార్యాచరణ ప్రణాళికలను అత్యంత ప్రభావితం అయ్యే సముదాయాలు, పౌర సమాజ సంఘాలు, ఇతర స్వతంత్ర నిపుణుల విస్తృత భాగస్వామ్యంతో సమీక్షించి, సవరించటాన్ని సౌలభ్యపరచాలి, ఇవి మరింత పకడ్బందీగా, ప్రభావశీలంగా ఉండాలి, వాతావరణ మార్పులను తగ్గించటం, అందుకు అనుగుణంగా మారటం అన్న లక్ష్యాలను మరింతగా సాధించగలగాలి, ఎండ, వానలలో తీవ్ర ఆటుపోట్లు వంటి వాతావరణ మార్పుల వల్ల ప్రభావితం అయ్యే వాళ్లకి సహాయ చర్యలకు ప్రాధాన్యతని ఇవ్వాలి;

భారత దేశంలో వేగంగా పెరుగుతున్న కార్బన్, గ్రీన్ క్రెడిట్ మార్కెట్‌ని, వాటికి సంబంధించిన న్యాయపర అంశాలను సునిశితంగా సమీక్షించాలి, వీటిల్లో ప్రజాస్వామికంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకపోవటం, సముదాయాలు (ప్రత్యేకించి అత్యంత దుర్బలులు) నిజంగా ప్రయోజనం పొందుతున్నాయా, వాతావరణ సంక్షభాన్ని తగ్గించటంలో దోహదపడుతోందా అన్న వాటిని ప్రత్యేకించి చూడాలి. వాతావరణ మార్పులను తగ్గించటం, అందుకు అనుగుణం మారటంలో సముదాయాల ద్వారా ప్రకృతి జీవావరణ వ్యవస్థల సంరక్షణ, సేంద్రియ వ్యవసాయానికి మారటం వంటి సముదాయాల నేతృత్వంలోని ప్రత్యామ్నాయ విధానాలపై మరింత దృష్టి పెట్టి, ప్రభుత్వ మద్దతును ఇవ్వాలి;

వాతావరణ, ఇతర విపత్తుల ప్రణాళికలలో, ఎన్ఏపిసిసి & నేషనల్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్)తో సహా, ఎస్‌సి/ ఎస్‌టిల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటి కోసం అనువైన బడ్జెట్ కేటాయింపులు చెయ్యాలి;  ఇటువంటి కేటాయింపులను ఎస్‌సి/ ఎస్‌టి ఉప ప్రణాళికలు, సంబంధిత ఇతర కార్యక్రమాలు, ఎస్‌సి సంక్షేమ బడ్జెటు, ఎస్‌టి సంక్షేమ బడ్జెటులలో పొందు పరచాలి.

నేల, నీరు పునరుద్ధరణకు జాతీయ స్థాయి కార్యక్రమం చేపట్టాలి, స్థానిక జీవావరణ సందర్భాలకు అనువైన పద్ధతులను ఉపయోగించి అర్థవంతమైన ఉపాధికి, జీవనోపాధులకు ఇది ఆధారం కావాలి; పైన పేర్కొన్న వాతావరణ ప్రత్యామ్నాయ విధానంతో దీనిని అనుసంధానం చెయ్యాలి;

అన్ని విష ఉత్పత్తులను, పురుగు మందులను, డిటర్జెంట్లను, అనేక ఇతర ప్రమాదకర రసాయనాలు లేదా లోహాలను వచ్చే 10 సంవత్సరాలలో దశల వారీగా నిర్మూలించాలి, వాటి స్థానంలో జీవావరణ పరంగా సున్నితమైన, భద్రమైన (మనుషులకు, జంతువులకు) ప్రత్యామ్నాయాలను ప్రవేశ పెట్టాలి;

అన్ని నీటి వనరులను శుభ్రం చెయ్యటానికి, పట్టణ, పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్యాన్ని నిర్మూలించటానికి, ఆమోదయోగ్యమైన స్థాయికి శబ్దాలను తగ్గించటానికి అత్యధిక ప్రాధాన్యతని ఇవ్వాలి; ప్రతి సంవత్సరం పది లక్షల మంది మృతికి, వారి మానసిక ఆరోగ్యం దెబ్బ తినటానికి కారణం అవుతున్న వాయు కాలుష్య సంక్షోభాన్ని యుద్ధ ప్రాతిపదికన ఎదుర్కోవాలి;

రాజ్యాంగంలోను, చట్టం లోను ప్రకృతికి, వన్యప్రాణులకు హక్కులను కల్పించటాన్ని పరిశీలించి అందుకు సంబంధిత సముదాయాలను, పౌరులను ప్రాథమిక కస్టోడియన్లుగా చెయ్యాలి;

ఆవాస ప్రాంతాల నుంచి ఏమాత్రం వ్యర్థాలు ఉత్పన్నం కాకుండా ఉండటాన్ని ప్రోత్సహించి, అందుకు తగిన ప్రోత్సాహకాలను ఇవ్వాలి, ఇందులో అసలు వ్యర్థాలు ఉత్పత్తి కాకుండా ఉండటానికి (జీవావరణ పరంగా భద్రమైన సాంప్రదాయ లేదా ఆధునిక ప్రత్యామ్నాయ పద్ధతులను ఉపయోగించి) ప్రాధాన్యతను ఇవ్వాలి, విషపూరిత వ్యర్థాలను ఉత్పన్నం చేసే పదార్థాలను నిషేధించాలి, పూర్తిగా ఉపయోగించిన తరవాత పారవేసే పదార్థాలను వేరే వాటికి ఉపయోగించాలి, అప్‌సైక్లింగ్, రిసైక్లింగ్ చెయ్యాలి, లేదా ఎరువుగా మార్చటం వంటివి చేయాలి;

ఎన్నికల కమిషన్, సిఏజిల లాగా స్వతంత్ర రాజ్యాంగ హోదాతో జాతీయ పర్యావరణ కమిషన్‌ని ఏర్పాటు చెయ్యాలి, ఇది ప్రామాణికాలను ఏర్పరచాలి, వాటిని రాష్ట్రాలు, ఇతర సంస్థలు పాటించేలా పర్యవేక్షించాలి, పౌరుల సమస్యల పరిష్కారానికి ఒక వేదికగా ఉండాలి.

పైన పేర్కొన్న పనులకు జాతీయ, రాష్ట్రాల బడ్జెట్లలో కనీసం 5 శాతం కేటాయించేలా చూడాలి.

## నివాస ప్రాంతాలు

సరైన గృహ వసతి, ఇతర సౌకర్యాలు లేకుండా, పని ప్రదేశాలలో ప్రమాదకరమైన పరిస్థితులలో పని చేస్తూ పట్టణాలలో కోట్లాది మంది ప్రజలు నివసిస్తున్నారు. పట్టణీకరణ ప్రక్రియే ఇష్టం వచ్చినట్టుగా, జీవావరణ రీత్యా సుస్థిరం కాని విధంగా జరుగుతోంది, ఇది గ్రామీణ ప్రాంతాల నుంచి వనరులను తీసుకుంటూ, అక్కడ వ్యర్థాలను గుమ్మరిస్తూ ఉండటంతో అవి తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. అనేక గ్రామాలలో సరైన సౌకర్యాలు, సదుపాయాలు లేవు. ఇంకొక వైపున రెంటికీ చెడ్డ రేవడి లాగా అటు పల్లెలు, ఇటు పట్టణాలు కాని ప్రదేశాలు చాలా ఉన్నాయి. వీటికి అటు పెద్ద పట్టణాలలో లాగా ప్రణాళికలు, ఆర్థిక వనరుల కేటాయింపులు ఉండవు, ఇటు గ్రామీణ ప్రాంతాల లాగా స్వయం సమృద్ధంగా ఉండే అవకాశం లేదు. ఈ సవాళ్ల నేపథ్యంలో మరింత సుస్థిర, న్యాయ, అందుబాటులో ఉండే నివాస ప్రాంతాలను రూపొందించటంలో ఉన్న అనేక స్ఫూర్తిదాయక ఉదాహరణలను ఆధారంగా చేసుకుని ఈ కింది చర్యలను చేపట్టాల్సిన అవసరం ఉంది:

74వ రాజ్యాంగ సవరణ కింద అనువైన చట్టాలు, పథకాలు చేసి పట్టణ ప్రణాళికల తయారీ, బడ్జెటింగ్ ప్రక్రియలలో ప్రాంత/ వార్డు/ పరిసర వాసుల భాగస్వామ్యాన్ని, జీవావరణ, సామాజిక ప్రభావాల అంచనాని తప్పనిసరి చెయ్యాలి (పైన పేర్కొన్న 'ప్రజాస్వామ్యం'లో చూడండి);

పని, ఇల్లు, బజారు, వినోదం వంటివి కుటుంబాలకు దగ్గరగా ఉండేలా పట్టణ, నగర ప్రణాళికలను మార్చి, తప్పనిసరి పనులకు ఎక్కువ దూరాలు ప్రయాణం చెయ్యాల్సిన అవసరం తగ్గించాలి;

సుస్థిర నిర్మాణాలు, ఆర్కిటెక్చర్, ఇళ్లు వంటివి గౌరవప్రదంగా ఉండి, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రోత్సాహించి, ప్రోత్సాహకాలు అందివ్వాలి, స్థానిక పదార్థాలను ఎక్కువగా ఉపయోగించాలి, పరిమాణానికి పరిమితి విధించాలి, సహజ భూమి తీరులను, వాటి చుట్టూ ఉండే ల్యాండ్‌స్కేప్‌లను గౌరవించాలి, సామాజికంగా, ఆర్థికంగా అంచుకు నెట్టివేయబడిన వర్గాలకు ప్రాధాన్యతను ఇవ్వాలి;

విద్యుత్తు ఉత్పత్తి; వాన నీటిని ఒడిసి పట్టటం, బాధ్యతాయుతంగా ఉపయోగించటం, పట్టణ వాసుల ఇతర మౌలిక అవసరాలకు స్థానిక, చిన్న, వికేంద్రీకృత చర్యలను చేపట్టటం ద్వారా దూర ప్రాంతాల రవాణా అవసరం లేకుండా, నగరాల భారం గ్రామీణ ప్రాంతాల మీద పడకుండా చూడాలి;

సహజ జీవావరణ వ్యవస్థలను సంరక్షిస్తూ, చెట్లు నాటేటప్పుడు స్థానికి రకాలకు ప్రాధాన్యతని ఇస్తూ, వన్యప్రాణులకు దారులు కల్పిస్తూ పట్టణాల ప్రణాళికల తయారీలో జీవ వైవిధ్యతను అంతర్భాగం చెయ్యాలి;

ఆయా ప్రాంతల జీవావరణ, సాంస్కృతిక పరిస్థితులను బట్టి అన్ని గ్రామీణ, అర్థ-గ్రామీణ/ అర్థ-పట్టణ ప్రాంతాలకు అన్ని మౌలిక అవసరాలు, సదుపాయాలు అందేలా చూడాలి, ఇందుకు స్థానికంగా అందుబాటులో ఉన్న నైపుణ్యాలను, జ్ఞానాన్ని, వనరులను ఉపయోగించుకోవాలి, స్థానిక ఉమ్మడి వనరులకు సంబంధించిన వాటితో సహా అన్ని రకాల స్థానిక స్వపరిపాలన సంస్థలు నిర్ణయం తీసుకునే ప్రక్రియను గౌరవించాలి (పైన పేర్కొన్న 'ప్రజాస్వామ్యం'లో చూడండి);

ప్రతి నివాస ప్రాంతానికి ముఖ్యమైన హరిత ప్రదేశాలు, బాడవ భూములు, పార్కులు, కొండలు వంటి అన్ని ఉమ్మడి ప్రదేశాలను కాపాడాలి, ప్రైవేటు అవసరాల కోసం తీసుకుని ఉంటే వాటిని తిరిగి ఉమ్మడి వనరులుగా మార్చాలి;

నడవటానికి, సైకిల్ ఉపయోగించటానికి స్నేహ పూర్వకంగా, ఆహ్లాదకరంగా, క్షేమకరంగా ఉండేలా అన్ని నివాస ప్రాంతాలను తయారు చేయాలి.

## రవాణా, ప్రయాణాలలో సౌలభ్యం

గత కొద్ది దశాబ్దాలలో రవాణా వ్యవస్థలు గణనీయంగా పెరిగాయి, అయినప్పటికీ అవసరం అయినంతగా లేకపోవటం, ప్రాధాన్యతలలో తేడా (ఉదా. గ్రామీణ రోడ్డులు కాకుండా, ప్రధాన రహదారులకు ప్రాముఖ్యతను ఇవ్వటం), వంటి సమస్యలు ఉన్నాయి. సుస్థిర, సమాన రవాణా విధానాలకు

సంబంధించిన కొన్ని ఉదాహరణలు కూడా ఉన్నాయి, వీటిని ఆధారంగా చేసుకుని కింద పేర్కొన్న చర్యలు చేపట్టాలి:

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సుస్థిర, అందుబాటులో ఉన్న, సమానమైన రవాణా సదుపాయాలకు అత్యంత అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి, అలాగే ప్రజా రవాణా సాధనాలు (ప్రత్యేకించి బస్సులు), మోటారు అవసరం లేని విధానాలు (నడవటం, సైకులు) వంటి వాటికి కూడా అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి; ప్రజా రవాణాని ఉపయోగించినప్పుడు వృద్ధులు, దివ్యాంగులు గమ్యం చేరుకోవటాన్ని సౌలభ్యపరచాలి;

ప్రైవేటు మోటారు వాహనాలపై అధిక పన్నుతో భారం మోపి, వాటికి ప్రవేశం లేని ప్రాంతాలను/ వేళలను నిర్ధారించాలి;
భద్రత కోసం, ఇంధన సమర్థ వినియోగం కోసం రోడ్డు వాహనాల వేగంపై పరిమితిని విధించాలి.

## నేర్చుకోవటం, విద్య, జ్ఞానం

విద్యని, నేర్చుకునే అవకాశాలను విస్తరింప చేయటంలో, సమాచారం, జ్ఞానాల వ్యాప్తిలో గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ విద్య, నేర్చుకోవటంలో భారత దేశం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. వీటిల్లో: చాలా గ్రామాలలో, పట్టణ పేద ప్రాంతాలలో ప్రత్యేకించి దళితులు, పశు పోషకులు, ఆదివాసీలు, దివ్యాంగులు, మహిళలు వంటి ప్రత్యేక అవసరాలు ఉన్న లేదా అంచులకు నెట్టివేయబడిన వాళ్ల విషయంలో చాలినంత సదుపాయాలు లేవు, లేదా అనువుకాని పరిస్థితులు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ఉన్న బడులు, కళాశాలల్లో నిజంగా నేర్చుకోవటం, పరిపూర్ణ మానవులుగా అభివృద్ధి చెందటం కాకుండా సమాచారాన్ని బట్టీ పెట్టి, ముక్కున పెట్టుకోవటంగా ఉంది. ఈ వ్యవస్థలలో ప్రజాస్వామిక పరిస్థితి లేకపోవటం, ఆధిపత్య ఆర్థిక వ్యవస్థలకు కావలసినట్టుగా తయారు చేయటంగా ఉన్నాయి. స్థానిక పరిస్థితుల (మాతృ భాషలతో సహా) వైవిధ్యతను పట్టించుకోకుండా పై నుంచి ఒకే రకమైన విధానాలను రుద్దటంగా ఉంది. నేర్చుకునే వాళ్ల మధ్య వ్యక్తిగత, స్వార్థపూరిత, పోటీతత్వంతో కూడిన విలువలను పెంపొందిస్తోంది. సాంప్రదాయ, స్థానిక విజ్ఞానాలు అంతరించిపోయేలా ఆధునిక, నియత జ్ఞానం చేస్తోంది. స్థానికతతో సంబంధం ఉన్న, కృత్యాధార విధానాలను తప్పనిసరి చేసిన జాతీయ మార్గదర్శకాలలోని ప్రగతిశీల విధివిధానాలను సరిగా అమలు చేయటం లేదు. ఇంకొక వైపున నేర్చుకోవటం, విద్యని మరింతగా అర్థవంతంగా చెయ్యటంలో, సముదాయాలు, పౌర సమాజాలు, ఇతర ప్రభుత్వ సంస్థలు బహుముఖీన విజ్ఞాన వ్యవస్థలను రూపొందించటంలో, ప్రసారం చేయటంలో ఎన్నో సృజనాత్మక చర్యలు ఉన్నాయి. ఈ సందర్భంలో కింద పేర్కొన్న చర్యల అవసరం ఉంది:
పుడమి-ఆధారిత విద్య, నేర్చుకోవటానికి అవకాశాలు సృష్టించే చర్యలను ప్రోత్సహించాలి, పర్యావరణంతో, ప్రకృతితో, సముదాయాలతో, ఒకరి శరీరం, మనసులతో, మానవాళి మొత్తంతో సంబంధాలను కొనసాగించటాన్ని, లేదా పునరుద్ధరించటాన్ని సౌలభ్యపరచాలి;

వ్యక్తిగత, సముదాయ సామార్థ్యాలు, సంబంధాలను పూర్తి స్థాయిలో సాధించేలా నేర్చుకునే వాతావరణాలను సృష్టించాలి, సృజనాత్మకతకు, ఆవిష్కరణలకు, విమర్శనాత్మకతకు, సమగ్ర ఆలోచనకు, కార్యాచరణకు ప్రతి ఒక్కరి లోనూ సామర్థ్యం ఉందని గుర్తించాలి;
నియత వ్యవస్థలు, అనియత, సముదాయ ఆధారిత నేర్చుకోవటం మధ్య, సాంప్రదాయ, ఆధునికతలకు మధ్య, స్థానిక, విశ్వ స్థాయిలకు మధ్య ఒకదాన్ని మరొకటి పెంపొందించుకునే సంబంధాలను ప్రోత్సహించాలి, సిద్ధాంతం – ఆచరణల సమ్మేళనం ఉండాలి (ఉదా: నయీ తాలింలోని మెదడు-హృదయం-చేతుల విధానం);

విభిన్న సాంస్కృతిక, జీవావరణ, సామాజిక పరిస్థితులకు ఉపయోగపడే, అనువైన అనేక ప్రత్యామ్నాయ నేర్చుకునే, విద్యా విధాలను ప్రోత్సహించాలి, ఇందులో సుసంపన్న చరిత్ర, పలు విధానాల వారసత్వం ఉండి పట్టణ కేంద్రాల నుండి పుట్టిన మూసపోత విధానాల అమలుకు బలయ్యే అవకాశాలు ఉన్న ఆదివాసీ, పశు పోషకులు, చేపలు పట్టేవాళ్లు, కొండ ప్రాంతాల వాళ్లు వంటి సముదాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి;
ఇటువంటి నేర్చుకోవటాన్ని, విద్యని సౌలభ్యపరచటంలో ప్రైవేటు సంస్థల కంటే ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యతను ఇస్తూ వాటిల్లో జవాబుదారీ విధానాలను ఏర్పాటు చెయ్యాలి;

వైవిధ్యభరితమైన సృజనాత్మక పద్ధతులతో పెద్దవాళ్లు నేర్చుకోటానికి మరిన్ని నేర్చుకునే స్థలాలను ఏర్పాటు చెయ్యాలి;

కళలు, క్రాఫ్ట్, నాటకం, నాట్యం వంటి వాటితో సహా భిన్నమైన నేర్పే పద్ధతులను, భావ ప్రసారాలను ఉపయోగించటాన్ని ప్రోత్సహించాలి;

పైన పేర్కొన్న వాటికి అనుగుణంగా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలను, ప్రక్రియలను మార్చాలి;

విద్య, నేర్చుకోటానికి జిడిపిలో కనీసం 6 శాతం కేటాయించాలి;

కనీస ప్రామాణికాలు ఉండేలా చూస్తూనే నేర్చుకునే వాతావరణంలో మరింత వైవిధ్యతకి దోహదం చేసేలా విద్యా హక్కు చట్టాన్ని సవరించాలి;

ఆధునిక – సాంప్రదాయ, శాస్త్రీయ – శాస్త్రీయేతర, నియత – అనియత, పట్టణ – గ్రామీణ వంటి జ్ఞాన రంగాల మధ్య సహకారాన్ని, ఒకదాన్ని మరొకటి పెంపొందించటాన్ని ప్రోత్సహించాలి;

ఓపెన్ సోర్స్, క్రియేటివ్ కామన్స్, ఇంకా ఇటువంటి ఇతర విధానాలతో సహా జ్ఞానం అనేది ప్రైవేటు యాజమాన్యం, నియంత్రణ లోని సరుకుగా కాక 'ఉమ్మడి వనరు'గా చేసే చొరవలను ప్రోత్సహించాలి;

మౌఖిక పద్ధతులు, కథలు చెప్పటం వంటి సాంప్రదాయ రూపాలతో సహా జ్ఞానాన్ని ప్రసారం చెయ్యటానికి ఉన్న వివిధ రూపాల పట్ల గౌరవాన్ని ప్రోత్సహించాలి.

## ప్రసార మాధ్యమాలు

ప్రసార మాధ్యమాల పై (ముద్రిత, డిజిటల్, 'సామాజిక') ప్రైవేటు కార్పొరేషన్ల, ప్రభుత్వాల పట్టు బిగుస్తోంది, అసత్య, కల్పిత వార్తలు బాగా పెరుగుతున్నాయి, నిరసించే గొంతులను అణచి వేస్తున్నారు, వేధిస్తున్నారు, ప్రభుత్వ అణచివేత చర్యలను ఎదుర్కోవటమే కాకుండా మనుగడ కోసం స్వతంత్ర మీడియా పోరాటాలు చెయ్యాల్సి వస్తోంది. ఈ నేపధ్యంలో, అనేక సృజనాత్మక, ప్రజాస్వామిక మీడియా చొరవలతో వచ్చిన అనుభవాలతో కింద పేర్కొన్న చర్యలు అవసరం:
టీవి, రేడియో, నిజంగా స్వతంత్రమైన ఇతరాలలో ప్రభుత్వం స్పోన్సార్ చేసిన వేదికలతో సహా వివిధ రూపాలలోని స్వతంత్ర మీడియాకి ప్రభుత్వ మద్దతు అందచేయాలి;

ప్రత్యామ్నాయ మీడియా చొరవలను, మీడియా అన్నది ఒక ప్రత్యేక వృత్తిగా మాత్రమే కాక పౌరుల రోజువారీ జీవితంలో భాగంగా చేసే ప్రజల సాధికారీకరణకు, సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపయోగపడే సమాచారాన్ని, ప్రక్రియలని ప్రసారం చెయ్యటంలో మీడియాని సృజనాత్మకంగా ఉపయోగించటాన్ని గుర్తించి, సౌలభ్య పరచాలి;
'మారుమూల ప్రాంతాలు'గా భావించి, సాధారణంగా పట్టించుకోని ప్రాంతాలలో సమాచార అందుబాటు ఉచితంగానూ, తేలికగానూ (మెరుగైన కనెక్టివిటీ ద్వారా) అందించే ప్రక్రియలను చేపట్టాలి;
ప్రకటనలు, ప్రత్యేకించి పిల్లలకు ఉద్దేశించినవి తప్పు దోవ పట్టించకుండా, అఫెన్సివ్‌గా ఉండకుండా, జీవితాలపై ఆక్రమణ చేయకుండా నియంత్రణలు ఉండాలి; అటువంటి ప్రకటనలపై న్యాయపరమైన, ఇతర చర్యలు తీసుకునేలా పౌరులను సాధికారులుగా చెయ్యాలి;

వాక్ స్వాతంత్రంపైన పరిధులు విధించేందుకు, సమాచారాన్ని ప్రభుత్వం నియంత్రించేందుకు దోహదం చేసే అన్ని చట్టాలు, నియమాలను సవరించాలి లేదా రద్దు చెయ్యాలి.

ప్రభుత్వ ప్రభావం లేకుండా మీడియా లైసెన్సింగ్, నియంత్రణ కోసం ఒక స్వతంత్ర, చట్టబద్ధ అధారిటీని ఏర్పాటు చెయ్యాలి;

విద్వేషాన్ని, ఘర్షణలను సృష్టించే ఉద్దేశంతో కావాలని తప్పుడు, పెడ దోవ పట్టించే, వక్రీకరించిన సందేశాలు, 'వార్తలు', విశ్లేషణలపై కఠిన చర్యలు తీసుకోవాలి, అయితే ప్రతి పౌరునికి ఉన్న భావ ప్రకటన స్వేచ్ఛ, వ్యక్తిగత ప్రైవసీ అన్న ప్రాథమిక హక్కులను ఈ చర్యలు అతిక్రమించకుండా చూడాలి.

## చట్టం, న్యాయం, ఆచారాలు

రాజ్యాంగంలో వికేంద్రీకరణకు సంబంధించి అక్షర రూపంలో, స్ఫూర్తి రూపంలో ఎన్నో ఉన్నప్పటికీ, చట్టాలు, విధివిధానాలు, న్యాయ వ్యవస్థలు మరింత భాగస్వామ్యంగా మారటానికి, అందుబాటులోకి రావటంలో ఎంతో ప్రగతి సాధించినప్పటికీ చట్టాలు రూపొందించటంలో, అమలు చెయ్యటంలో భారత దేశం చాలా కేంద్రీకృత వ్యవస్థగానే ఉంది, ఇంకోవైపు పరిష్కారం కాని, విచారణకు రాని కేసులు న్యాయ వ్యవస్థకి భారంగా మారాయి. వివాదాలను చాలావరకు న్యాయంగా పరిష్కరంచటంలో ప్రజలకు అందుబాటులో ఉండిన సాంప్రదాయ పద్ధతులు బలహీన పడ్డాయి (అయితే వీటిల్లో సంస్కరణ అవసరం అయిన అణచివేత, పక్షపాత ధోరణులు ఉన్నాయి). చట్టాలను, సంప్రదాయాలను ఉల్లంఘించినప్పుడు అటువంటి ప్రవర్తనకు కారణం అయిన వ్యవస్థాగత కారణాలను పట్టించుకోకుండా పూర్తి నేరం వ్యక్తి మీద మోపి, శిక్షించే విధానమే ప్రధానంగా ఉంది. అయితే, ఇందుకు భిన్నంగా న్యాయం నిర్ణయించటంలో, చట్టాలు రూపొందించటంలో అనేక సృజనాత్మక విధానాల నుంచి మనం నేర్చుకోటానికి ఎన్నో ఉన్నాయి. ఈ కింద పేర్కొన్న అంశాల అవసరం ఉంది:

దివ్యాంగులకు చట్టం ముందు సమాన గర్తింపును ఇవ్వాలి, నిర్ణయాలు తీసుకునే వేదికలలో వాళ్లు అర్థవంతంగా పాల్గొనటానికి మద్దతు ఇవ్వాలి

చట్టాలు రూపొందించటం, నిర్వహణ, అమలులలో ప్రజల విస్తృత భాగస్వామ్యం ఉండేలా చెయ్యాలి, ఇటువంటి ప్రక్రియలలో స్థానిక స్వపరిపాలనా సంస్థలు తప్పనిసరిగా పాల్గొనేలా వాటిని సాధికారికం చెయ్యాలి;

అన్ని చట్టాలలోనూ ప్రజల భాగస్వామ్యం అన్నది కీలకమైన భాగంగా ఉండేలా చూడాలి, అధికారంలో ఉండి ఈ అంశాన్ని ఉల్లంఘించే వాళ్లపై, లేదా దాని అమలును కావాలని అడ్డుకునే వాళ్లపై చర్యలు తీసుకోవాలి;

సామాజిక, ఆర్థిక కారణాల వల్ల న్యాయ వ్యవస్థలు, సమస్యల పరిష్కారం అందుబాటులో లేని వాళ్లకి అవి అందుబాటులోకి వచ్చేలా చెయ్యాలి, సొంతంగా న్యాయ ఖర్చులు భరించలేని వాళ్లకి ప్రభుత్వ మద్దతును పెంచి మరింత ప్రభావశీలంగా ఉండేలా చెయ్యాలి;

నియత, చట్టబద్ధ చట్టాలు – సామాజిక నియమాలు, ఆచారాల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలను సౌలభ్యపరిచి, న్యాయం, సమత, నిష్పక్షపాతం, సుస్థిరత దృష్ట్యా ఒకదానిని మరొకటి బలపరుస్తూ, నియంత్రిస్తూ ఉండాలి; నియత చట్టాలు/ నియమాలు పై నుంచి రుద్దటం కాకుండా నిబంధనలు అన్నవి జీవన విధానంగా మారేలా (బాల్యంతో మొదలుకుని) ప్రయత్నాలను ముమ్మరం చెయ్యాలి; వ్యక్తిగత భావాలలో 'తేడాలు' (ఉదా. జెండర్/ లైంగిక దృక్పథం) కాకుండా ఏది 'శిక్షార్హం' అనేది తేల్చటానికి ఇతరులకు హాని కలిగించటం అన్నది మౌలికంగా తీసుకుని 'నేరం' లేదా 'చట్ట విరుద్ధం' అన్న దానిని విశాల దృష్టితో చూసేలా న్యాయ వ్యవస్థని సంస్కరించాలి; శిక్షించటం, ఖైదు చెయ్యటం అన్న సాంప్రదాయ రూపాలు కాకుండా, సమస్య పరిష్కారం, పునరావాసం, పరివర్తనలో మార్పు వంటి చర్యలకు ప్రాధాన్యతను ఇవ్వాలి;

మరణ శిక్షను రద్దు చెయ్యాలి;

నియమాలు, చట్టాల ఉల్లంఘునను వ్యవహరించటంలో వికేంద్రీకృత కోర్టులు, పంచాయితీలు, సమస్యల పరిష్కారానికి సంప్రదాయ పద్ధతులు (అదే సమయంలో వీటిల్లో న్యాయం, సమత, నిష్పక్షపాతం ఉండేలా చూడటానికి సంస్కరణలు చెయ్యాలి), ఓంబడ్స్ వ్యక్తులు, ఇతర వినూత్న విధానాల వంటి వాటితో సహా సముదాయాల భాగస్వామ్యానికి మరిన్ని అవకాశాలు కల్పించాలి.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, న్యాయం, నిష్పక్షపాత సూత్రాలకు విరుద్ధంగా ముందస్తుగానే వ్యక్తులను అరెస్టు చెయ్యటానికి దుర్వినియోగం చేస్తున్న చట్ట విరుద్ధ కార్యకలాపాల నివారణ (ఉపా) చట్టం, 1967; జాతీయ భద్రతా చట్టం; ఐపిసి కింద రాజద్రోహ క్లాజులను రద్దుచెయ్యాలి; భవిష్యత్తులో ఇటువంటి చట్టాలు రూపొందించకుండా చూడాలి.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్ (సిబిఐ), ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లను రాజకీయ లబ్ధి కోసం దుర్వినియోగం చెయ్యకుండా అవి స్వతంత్రంగా, నిబద్ధతతో పని చేసేలా చూడాలి.

## ప్రపంచ సంబంధాలు

ప్రపంచం అనేక విధాలుగా చీలి ఉన్న, అంతర్జాతీయ ఘర్షణలు, ప్రపంచ ఉమ్మడి వనరుల విధ్వంసంలో ఐక్య రాజ్య సమితి పని తీరు ఫలితాలు మిశ్రమంగా ఉన్న నేపధ్యంలో ప్రపంచ సంభంధాలలో సాంప్రదాయంగా భారత దేశం పోషించిన అలీన, దోపిడీకి గురైన వాళ్లకు, స్వేచ్ఛకి అనుకూల విధానాల నుంచి వెనకంజ వేస్తున్నట్టు ఉంది. అయినప్పటికీ, మానవ హక్కులు, జీవావరణ సుస్థిరతను కాపాడే న్యాయ, నిష్పక్షపాత ప్రపంచం అన్న ఆదర్శాన్ని భారత దేశం తరచూ చాటుతూనే ఉంది. ఈ సందర్భంలో కింద పేర్కొన్న చర్యలు చేపట్టాలి:

భౌగోళిక-రాజకీయ వైరాలతో ప్రేరేపింపబడుతున్న తీవ్ర పోటీతత్వ అంతర్జాతీయ సంబంధాల ప్రస్తుత స్థితి నుండి ప్రత్యామ్నాయాలను కల్పించే ప్రభుత్వ, పౌర సమాజ, సమాజ లేదా బహుముఖ చొరవలను సౌలభ్యపరచి, ప్రోత్సహించాలి;

అంతర్జాతీయ, ప్రపంచ సంబంధాలలో ఈ అంశాలలో ఐక్య రాజ్య సమితి చేసిన అనేక ఒప్పందాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయటంతో సహా మానవ హక్కులు, జీవావరణ, సామాజిక-సాంస్కృతిక, ఇతర విలువలను పెంచటానికి క్రియాశీలకంగా వ్యవహరించాలి;

విదేశీ వ్యవహార సంబంధాలలో జాతి ఆధిక్యత వంటి సంకుచిత భావనలు, ప్రాధాన్యతలు కాకుండా ఉమ్మడిగా మానవాళి బాగును కోరుకునే విధానాన్ని చేపట్టాలి;

ప్రపంచ (వాతావారణ, ప్రపంచ ఉమ్మడి వనరులతో సహా) విధ్వంసానికి కారణమైన వలస పాలకులుగా ఉండిన దేశాలతో సహా ఉత్తర/ పారిశ్రామిక దేశాల చారిత్రిక బాధ్యతను గుర్తింప చెయ్యాలి; ఈ జీవావరణ, ఆర్థిక రుణాన్ని తీర్చుకోటానికి, పునరుద్ధరణ, నష్ట పరిహార చర్యలకు తగినంత చెల్లింపులు, చర్యలు చేపట్టేలా చెయ్యాలి;

సైన్యం, నిఘా, పోలీసులపై ఖర్చును మరింత పెంచకుండా ప్రపంచ స్థాయిలో నిషేధం విధిస్తూనే వీటి మీద ఖర్చుని క్రమేపి తగ్గించుకునేలా చూడాలి, ఆయుధ వ్యాపారంపై ప్రపంచ స్థాయి నిషేధం వహించాలి, అంతిమంగా అన్ని దేశాలు అన్ని రకాల ఆయుధాలను లేకుండా చెయ్యాలి;
ప్రభుత్వేతర సమూహాలు, సముదాయాల గళం మరింతగా వినిపించటానికి ఐక్య రాజ్య సమితిని తిరిగి నిర్మించటంతో సహా 'జాతి-రాజ్యం' అన్న భావనలను పరిశీలిస్తూ, ప్రపంచ 'ప్రజల' మధ్య సంబంధాలకు ప్రాధాన్యతను ఇచ్చేలా ప్రపంచ స్థాయిలో పెద్ద ఎత్తున చర్చలో పాల్గొనాలి;

వాతావరణ సంక్షోభం, జీవ వైవిధ్యత అంతరించిపోవటం, కాలుష్యం, విష పదార్థాలు వంటి వాటి పై అత్యవసర చర్యలను కోరుతూ ప్రపంచ స్థాయి ఒప్పందాలకు పదును పెట్టాలి, మెరుగుపరచాలి, అవి అమలు అయ్యేలా చూడటానికి నిర్దిష్ట నిషేధాలు, ప్రభావవంతమైన ఇతర విధానాలను చేర్చాలి;

ప్రపంచ వాణిజ్య నియంత్రణకు కృషి చెయ్యాలి, శ్రామిక, పర్యావరణ/ జీవావరణ, మానవ హక్కుల ఒప్పందాలు జాతీయ, ప్రపంచ నియమాలకు అనుగుణంగా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) వంటి సంబంధిత సంస్థలు నడుచుకోవాలి; ఇటువంటి వాణిజ్యం స్థానిక ఆర్థిక పరిస్థితికి, సంస్కృతులకు ఎటువంటి పరిస్థితులలోనూ గొడ్డలి పెట్టు లాగా ఉండకూడదు, సరిచేయలేని విధంగా జీవావరణానికి నష్టం చేకూర్చకూడదు.

## భాగం 4: యువత భాగస్వామ్యాన్ని పెంపొందించటానికి ప్రత్యేక దృష్టికోణం

వ్యక్తి నుంచి సమాజానికి చేసే ప్రయాణాల ద్వారా యువత నేర్చుకోవటానికి నాయకత్వ లక్షణాలను పెంపొందించే 'సాధికారీకరణ స్థలాలను' కలిసి సృష్టించి, మద్దతు ఇవ్వాలి, ప్రోత్సహించాలి. భిన్న, బహు ముఖీన గుర్తింపులు ఉన్న యువత కలిసి నేతృత్వం వహించే తీర్పులు చెప్పని ప్రదేశాలు ఇందులో ఉంటాయి, సామాజిక న్యాయం, సమాలోచన-కార్యాచారణ, జైవ పునరుద్ధరణ, ప్రేమ, నేర్చుకోవటం, స్వేచ్ఛ, యాజమాన్యం, కలిసి పనిచేయటం, సహకరించుకోవటం, సామాజిక ఆశ వంటి వాటి మీద పని చేసి, స్ఫూర్తిని పొందాలి. శారీరిక శ్రమతో సహా యువత వివిధ నిర్మాణాత్మక, సృజనాత్మక కార్యక్రమాలు చెయ్యడానికి ఈ ప్రదేశాలు అవకాశాలు కల్పించాలి. ఇవి తమ ప్రాపంచిక దృక్పథంతో తమకి సంబంధం కలుపుకోవటంలో సహాయపడతాయి, వాళ్ల ఆలోచనలు, శక్తులను పునరుద్ధరిస్తాయి;

యువత నేతృత్వం లోని, యువత కేంద్రంగా ఉన్న సంస్థలు, సాధికారీకరణ కేంద్రాలను వివిధ స్థాయిలలో ఏర్పాటు చేసి, ప్రోత్సహించాలి, తమ హక్కులను కాపాడుకునే ప్రక్రియలు ఇందులో భాగంగా ఉండాలి; పూర్తిగా భిన్నమైన, మార్పును తెచ్చే యువత దార్శికతను కలిసి సృష్టించటాన్ని, అమలు చెయ్యటాన్ని, వ్యక్తీకరించటాన్ని సౌలభ్య పరచాలి;

అన్ని చట్టాలు, విధివిధానాలు, ప్రణాళికలు, పథకాల తయారీ, అమలు, పర్యవేక్షణలలో యువత, ప్రత్యేకించి బడుగు సముదాయాల నుంచి వచ్చిన వాళ్లు విస్తృతంగా పాల్గొనేలా చూడాలి; అన్ని సంబంధిత కమిటీలలో వాళ్ల భాగస్వామ్యం తప్పనిసరి చెయ్యాలి;

యువతలో కీలక సామర్థ్యాలు, జీవన నైపుణ్యాలను పెంపొందించటానికి ఎన్ఎస్ఎస్, ఎన్వైకెఎస్ వంటి యువత ఆధ్వర్యంలో, వాళ్లు కేంద్రంగా పని చేసే ప్రభుత్వ పథకాలలో, వాలంటీరింగ్ ప్రక్రియలలో వాళ్ల భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచాలి;

నిధులు, మార్గదర్శనం వంటి వనరులు తేలికగా అందుబాటులోకి తెచ్చి, అర్ధవంతమైన ఉపాధి, ఎంటర్‌ప్రెన్యుర్‌షిప్ సామర్థాలు కల్పించటం, పెంపొందించటం ద్వారా జీవనోపాధి, ఉపాధి అవకాశాలు కల్పించాలి; జీవావరణ పునరుద్ధరణ, సంరక్షణ, సామాజిక న్యాయం, మౌలిక అవసరాల సేవలు, సరుకులు, సముదాయ, సహకార ఆర్థిక కార్యక్రమాలతో ముడిపడి ఉన్న ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలను ప్రత్యేకంగా పెంపొందించాలి;

బడుగు వర్గాల యువతకు, దివ్యాంగులు, మానసిక ఆరోగ్య సవాళ్లు ఉన్న వాళ్లు, బహుజన, ఆధివాసీ, మతపరమైన అల్పసంఖ్యాక వర్గాలకు, ఎల్‌జిబిటిక్యూఐఎ+ లేదా అంచులకు నెట్టివేయబడిన సముదాయలకు, ప్రత్యేకించి వీటికి చెందిన యువతులకు (ఇప్పటికే ఉన్న పథకాలను సమర్థంగా

అమలు చెయ్యటంతో సహా) ప్రత్యేక సేవలు, మద్దతును అందించాలి; ఇటువంటి నేర్చుకునే ప్రదేశాలు యువతకు క్షేమకరంగా ఉండేలా చూడాలి;

సలహాలు, క్రీడలు, వినోద కార్యక్రమాలను, ప్రత్యామ్నాయ జీవనోపాధులపై కేంద్రీకరించే ఉపాధి సలహాలను అందించే యువత సాధికారత కేంద్రాలను ప్రతి కొద్ది నివాస ప్రాంతాలకు ఏర్పాటు చెయ్యాలి;

జాతీయ, రాష్ట్ర స్థాయి యువత విధివిధానాలలో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలి, ఏర్పాటు చేసిన వివిధ కమిటీల ప్రగతిని సమీక్షించటానికి, నివేదించటానికి వివిధ స్థాయిలలో యువత కమిషన్లను, యువత సలహా సంఘాలను ఏర్పాటు చెయ్యాలి. రాష్ట్ర స్థాయిలో యువతకి సంబంధించి విధివిధానం లేనప్పుడు దానిని రూపొందించాలి;

యవతకి సంబంధించిన విధివిధానాలను అమలు చెయ్యటానికి, మార్గదర్శనానికి చట్టబద్ధమైన యువత కమిషన్‌ని ఏర్పాటు చెయ్యాలి;

తమ దృక్పథాలు, దృష్టిని విశాలం చేసుకుని, ఈ మ్యానిఫెస్టోలో పేర్కొన్న వివిధ ఉమ్మడి అంశాలపై సంఘీభావాన్ని ఏర్పరచేలా జాతీయ, దక్షిణ ఆసియా, ప్రపంచ స్థాయిలో యువతను అటు, ఇటు పంపించటాన్ని ప్రోత్సహించాలి.

వికల్ప్ సంగమ్ సర్వ సభ్య సంఘ సభ్యులు

యాక్షన్ ఫర్ కమ్యూనిటి ఆర్గనైజేషన్, రిహాబిలిటేషన్ ఎండ్ డెవలప్‌మెంట్ (అకార్డ్)
అగ్రగామి
అలయన్స్ ఫర్ సస్టేనబల్ ఎండ్ హోలిస్టిక్ అగ్రికల్చర్ (ఆషా)
ఆల్టర్‌నేటివ్ లా ఫోరం (ఏఎల్ఎఫ్)
భూమి కాలేజ్
బ్లూ రిబ్బన్ మూవ్‌మెంట్ (బిఆర్ఎం)
సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ ఎండ్ డాక్యుమెంటేషన్ (సిఇడి)
సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ (సీఇఇ)
సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటి (సిఎఫ్ఏ)
సెంటర్ ఫర్ పాస్టోరలిజం
చెలకుడిపూఝా సంరక్షణ సమితి/ రివర్ రీసర్చ్ సెంటర్
చేతనా
సిజినెట్ స్వర
దక్షిణ్ ఫౌండేషన్
డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డిడిఎస్)

డీర్ పార్క్
డెవలప్‌మెంట్ ఆల్టర్‌నేటివ్స్ (డిఏ)
డెసర్ట్ రిసోర్స్ సెంటర్ (డిఆర్‌సి)
ధాత్రి ట్రస్ట్
ధరామిత్రా
ఏక్తా
ఈక్విటబల్ టూరిజం ఆప్షన్స్ (ఈక్వేషన్స్)
ఫారెస్ట్ రైట్స్ కొయలిషన్ – జెకె
ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ – ఇండియా
జీన్ క్యాంపేన్
గూంజ్
గ్రీన్‌పీస్ ఇండియా
ఈడియోసింక్ మీడియా కంబైన్
ఇన్నర్ క్లైమేట్ అకాడమీ (ఐసిఏ)
మార్గ్‌శాలా ఫౌండేషన్
జాగోరీ రూరల్
కాగడ్ కచ్ పత్ర కాష్టకారీ పంచాయత్ (కెకెపికెపి)
కల్పవృక్ష్
క్రితి టీం
లడఖ్ ఆర్ట్స్ ఎండ్ మీడియా ఆర్గనైజేషన్ (లామో)
లెట్ ఇండియా బ్రీత్ (ఎల్‌ఐబి)
లోకల్ ఫ్యుచర్స్
మాధ్యం
మాటి
మహిళా కిసాన్ అధికార్ మంచ్ (మకాం)
మహలిర్ అసోసియేషన్ ఫర్ లిటరిసీ ఎవేర్‌నెస్ ఎండ్ రైట్స్ (మలర్)
మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకెఎస్‌ఎస్)
మూవ్‌మెంట్ ఫర్ అడ్వాన్సింగ్ అండర్‌స్టాండింగ్ ఆఫ్ సస్టేనబిలిటి ఎండ్ మ్యుచ్యువాలిటి (మౌసం)
నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ (ఎన్‌ఎపిఎం)
నేషనల్ క్యాంపేన్ ఫర్ దళిత్ హ్యూమన్ రైట్స్ (ఎన్‌సిడిహెచ్‌ఆర్)
నేషనల్ కొయలిషన్ ఫరి నేచురల్ ఫార్మింగ్ (ఎన్‌సిఎన్‌ఎఫ్)
నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ దళిత్ ఉమెన్ (ఎన్‌ఎఫ్‌డిడబ్ల్యు)
నిరంగల్ చారిటబుల్ ట్రస్ట్
నాన్-టింబర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ ఎక్స్‌ఛేంజ్ (ఎన్‌టిఎఫ్‌పి-ఇ)
నార్త్ ఈస్ట్ నెట్‌వర్క్ (ఎన్‌ఇఎన్)
ఆర్గానిక్ ఫార్మర్స్ మార్కెట్ (ఓఎఫ్‌ఎం)
పీపుల్స్ రిసోర్స్ సెంటర్ (పిఆర్‌సి)
పీపుల్స్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ (పిఎస్‌ఐ)

రిస్టోర్
రివైటలైజింగ్ రేన్‌ఫెడ్ అగ్రికల్చర్ నెట్‌వర్క్ (ఆర్ఆర్ఏ)
రైతు స్వరాజ్య వేదిక
సంభావనా
ఫౌండేషన్ ఫర్ ఎకనమిక్ ఎండ్ ఎకాలాజికల్ డెవలప్‌మెంట్ (ఫీడ్)
సహజీవన్
సహోదయ ట్రస్ట్
సంగత్
స్కూల్ ఫర్ డెమొక్రసీ
స్కూల్ ఫర్ డెవలప్‌మెంట్ ఎండ్ ఎన్విరాన్‌మెంట్ (ఎస్ఆర్డిఇ)
శిక్షాంతర్
స్నో లెపర్డ్ కన్సర్వెన్సీ ఇండియా ట్రస్ట్ (ఎస్ఎల్‌సి-ఐటి)
సిక్కిం ఇండిజినస్ లెప్చా ట్రైబల్ అసోసియేషన్
సోషల్ ఎంటర్‌ప్రెన్యుర్‌షిప్ అసోసియేషన్ (ఎస్ఇఏ)
సొసైటీ ఫర్ ప్రమోటింగ్ పార్టిసిపేటివ్ ఎకోసిస్టం మానేజ్‌మెంట్ (సొప్పెకాం)
సౌత్ ఏషియన్ డైలాగ్ ఆన్ ఎకలాజికల్ డెమొక్రసీ (సాడెడ్)/ హరిత్ స్వరాజ్ సంవాద్
ది హిమాలయ కలెక్టివ్
టింబక్తు కలెక్టివ్
తిత్లి ట్రస్ట్
ట్రావెలర్స్ యునివర్సిటి
ట్రైబల్ హెల్త్ ఇనీషియేటివ్ (టిహెచ్ఐ)
ఉర్ముల్ సీమంత్ సమితి
వాటరషెడ్ సపోర్ట్ సర్వీసెస్ ఎండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ (వాసన్)
యూత్ అలయన్స్
యుగ్మా కలెక్టివ్
యువ ఏక్తా ఫౌండేషన్
దినేష్ అబ్రాల్
మోహన్ హీరాబాయి హీరాలాల్
ఓవైస్ సుల్తాన్ ఖాన్
సెహ్‌జో సింగ్

### వికల్ప్ సంగమ్‌ని సంప్రదించటానికి:

KJ Joy, joykjjoy2@gmail.com
Shrishtee Bajpai, shrishtee.bajpai@gmail.com
Yash Marwah, yash@letindiabreathe.org
Asmi Sharma, asmixsharma@gmail.com